ఈనాడు
శ్రీకాకుళం
మంగళవారం అక్టోబరు 1, 2024

రారండోయ్ జాతర చూసొద్దాం..

నేటి నుంచి కొత్తమ్మతల్లి ఉత్సవాలు




కోరిన కోర్కెలు తీర్చే అమ్మగా.. కోటబొమ్మాళి ప్రజల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న కొత్తమ్మ తల్లి జాతర వచ్చేసింది. మూడు రోజుల పాటు ఉత్సవ శోభతో క్షేత్రం అలరారనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ దేవాదాయ శాఖ పూర్తి చేసింది.. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తుల కోసం ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. మంగళవారం నుంచి గురువారం వరకు అంగరంగ వైభవంగా జాతర నిర్వహించేందుకు అన్ని చర్యలు అధికార యంత్రాంగం తీసుకుంది.
– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

పట్టువస్త్రాలు సమర్పించనున్న కేంద్ర మంత్రి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొత్తమ్మతల్లి ఆలయానికి ఆంధ్ర, ఒడిశాకు చెందిన భక్తులు పెద్దఎత్తున వస్తుంటారు. గురువారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు. ఆది, మంగళవారాల్లో ఎక్కువగా అమ్మవారిని దర్శించుకుంటారు. భక్తుల తాకిడి పెరిగిన నేపథ్యంలో 1985లోనే కొత్తమ్మతల్లి ఆలయం దేవాదాయ శాఖ పరిధిలోకి చేరింది. అదే ఏడాది నుంచి ధర్మకర్తల మండలిని నియమిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే కొత్తమ్మతల్లి జాతరను రాష్ట్ర పండగగా నిర్వహిస్తామని ఎన్నికల ప్రచారంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంగళవారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

భారీ బందోబస్తు

జాతర సందర్భంగా ఏఎస్పీ పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో 8 మంది మంది సీఐలు, 23 మంది ఎస్సైలు, మహిళా పోలీసులు, మూడు ప్రత్యేక బలగాలు, 200 మంది పోలీసులు, 200 మంది హోంగార్డులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కొత్తమ్మతల్లి ఆలయం నుంచి కొత్తపేట, సంతబొమ్మాళి వైపు నాలుగు ప్రాంతాల్లో బారికేడ్లతో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. ఒకే దారి కావడంతో వాహనాలను నియంత్రిస్తూ భక్తులు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నారు.

పక్కాగా పారిశుద్ధ్య చర్యలు

ఆలయం, కోటబొమ్మాళి, కొత్తపేట ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా 80 మందికి పైగా పారిశుద్ధ్య సిబ్బందిని టెక్కలి, సోంపేట, పాతపట్నం నుంచి రప్పించారు. ఎంపీడీవో ఫణీంద్రకుమార్ నేతృత్వంలో ఐదుగురు ఈవోపీఆర్డీలు, మరో ఐదుగురు ఈవోల పర్యవేక్షణలో వీరు పని చేయనున్నారు.

☛ విద్యుత్తు సరఫరాలో ఇబ్బంది తలెత్తకుండా 40 మందికి పైగా సిబ్బంది మూడు షిఫ్టుల్లో పని చేసేలా చర్యలు తీసుకున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు.

☛ తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లను గ్రామీణ నీటి సరఫరా శాఖ పర్యవేక్షిస్తుంది. నిమ్మాడ, తిలారు, కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. ఆరుగురు వైద్యులు, సిబ్బంది 108 వాహనంతో అందుబాటులో ఉంటారు.


పూల అలంకరణలో మండపం

విద్యుద్దీపకాంతులో కళకళలాడుతున్న రాజగోపురం

ఇదీ ప్రాశస్త్యం

కోటబొమ్మాళి గ్రామానికి చెందిన కమ్మకట్టు చినఅప్పలనాయుడు ప్రతి గురువారం నేరేడివలస (నారాయణవలస) వారపు సంతలో క్రయవిక్రయాలకు ఎండ్లబండిపై రాకపోకలు సాగించేవారు. ఓసారి తిరిగివస్తుండగా మార్గమధ్యలో ఓ ముత్తయిదువు ఆపి కోటబొమ్మాళి వరకు వస్తానని చెప్పి బండి ఎక్కింది. గ్రామానికి ముందు పట్నాయకుని వెంకటేశ్వరరావు మామిడితోట వద్ద నిర్మానుష్య ప్రాంతంలో దిగి అదృశ్యమైంది. అదే రోజు రాత్రి చినఅప్పలనాయుడు కలలో కనిపించి బండి దిగిన ప్రాంతంలోనే కొత్తమ్మ తల్లిగా వెలిశానని చెప్పినట్లు కథనం. నిర్మానుష్య ప్రాంతంలో 1925లో అదృశ్యమైన ఓ ముత్తయిదువు గ్రామాన్ని రక్షించేందుకు కొత్తమ్మతల్లిగా వెలిసిందని గ్రామస్థులు చెబుతుంటారు. మామిడితోట ప్రాంతంలోనే పూజలు ప్రారంభమయ్యాయి. ఏటా పోలాల అమావాస్య తర్వాత వచ్చే గురువారం అమ్మవారి జాతరకు ఆఖరి రోజుగా పరిగణించి పండగ నిర్వహిస్తున్నారు. ఉత్సవాలకు లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. తొలిరోజు కొత్తమ్మతల్లి ఆలయం నుంచి అమ్మవారి జంగిడి మేళతాళాలతో కమ్మకట్టు చినఅప్పలనాయుడు ఇంటికి వెళ్తుంది. చివరిరోజున వేలాది ఘటాలతో ఆలయానికి చేరుతుంది. వీధుల్లో అమ్మవారి జంగిడికి విశేష పూజలు చేస్తారు. పెద్దఎత్తున పోలీసు బందోబస్తుతో ఊరేగింపు సాగుతుంది. కొత్తమ్మతల్లికి జై అంటూ భక్తులు జయజయధ్వానాలు పలుకుతారు.


జాతర సందర్భంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు సోమవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను మంత్రి అచ్చెన్నాయుడు పరిచయం చేసుకుని పోటీలను తిలకించారు.

విన్నపాలు వినవలె..

'మీ కోసం'లో 168 అర్జీల స్వీకరణ


సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం అర్బన్, శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు సూచించారు. జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో వినతులు స్వీకరించారు. 168 అర్జీలు అందాయి, సెట్‌శ్రీ సీఈవో ఆర్.వెంకట్రామన్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ◆ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్స్‌కు 68 వినతులు వచ్చాయి. వాటిని ఎస్పీ మహేశ్వరరెడ్డి స్వయంగా తీసుకున్నారు.

◆ వైద్య ఆరోగ్య శాఖలో 18 నెలల పాటు ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోలుగా విధులు నిర్వహించిన 14 మందిని నాటి ప్రభుత్వం తొలగించింది. కోర్టు ఆదేశాల మేరకు తిరిగి చేర్చుకోవాలని తండ్యాల సుధబాబు సహా పలువురు అర్జీ అందజేశారు.

◆ కొత్తూరు మండలం మదనాపురం పంచాయతీ పరిధిలో ప్రభుత్వ బావిని వైకాపా మద్దతుదారు ఆక్రమించారని గండికోట త్రినాథరావు ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు

◆ ఎచ్చెర్ల మండల పరిధిలో నారాయణపురం ఆనకట్ట నుంచి శివారులోని 13 గ్రామాలకు సాగు నీరు అందించి 10 వేల ఎకరాల ఆయకట్టును కాపాడాలని రామజోగిపేట గ్రామానికి చెందిన కర్షకులు మొరపెట్టుకున్నారు.

◆ శ్రీకాకుళం నగర పరిధి ఖైరివానిపేటలో సర్వే నంబరు 85లోని చెరువుపై ఆధారపడి పంటలు పండించేవారమని.. కొందరు చెరువును ఆక్రమించడంతో ఇబ్బంది పడుతున్నట్లు నాగరాజు అనే వ్యక్తి అర్జీ అందజేశారు.

28 వసతిగృహాలకు మోక్షం



- రూ.4.32 కోట్లతో మరమ్మతులకు ప్రతిపాదనలు
- 'ఈనాడు', 'ఈటీవీ-ఆంధ్రప్రదేశ్' కథనాలకు స్పందన

ఎల్ఎన్‌పేటలోని సాంఘిక సంక్షేమ వసతిగృహ భవనం శిథిలమైందని.. తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు లేవని 'ఈనాడు', 'ఈటీవీ-ఆంధ్రప్రదేశ్'లో సెప్టెంబరులో వరుస కథనాలు రావడంతో కలెక్టర్ స్పందించారు. రాష్ట్ర విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) సూచన మేరకు జిల్లాలోని 28 వసతిగృహాల్లో మరమ్మతులకు రూ.4.32 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఎల్ఎన్‌పేట వసతిగృహానికి రూ.18 లక్షలు మంజూరు చేయనున్నారు. తాత్కాలిక మరమ్మతులకు రూ.15 వేలు విడుదల చేశామని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు వై.విశ్వమోహన్‌రెడ్డి తెలిపారు. – న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

ముగిసిన ఈ- పంట నమోదు

- 4.74 లక్షల ఎకరాల వివరాల సేకరణ
- ఈకేవైసీలో 12 మండలాలు వెనుకబాటు


నరసన్నపేట మండలం యారబాడులో ఈకేవైసీ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

న్యూస్‌టుడే, నరసన్నపేట

ప్రస్తుత ఖరీఫ్ కాలానికి ఈ- పంట నమోదు గడువు ముగిసింది. వివరాల సేకరణ సెప్టెంబరు 15 నాటికి పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ నిర్దేశించగా, ప్రక్రియ పూర్తి కాకపోవడంతో మరో 15 రోజుల పాటు గడువు పెంచింది. జిల్లా వ్యాప్తంగా 3,62,525 మంది రైతుల సాగులో ఉన్న 4,74,707 ఎకరాల్లోని వివిధ పంటలకు సంబంధించి వివరాలను సిబ్బంది సేకరించారు. ప్రభుత్వ పథకాలను పంటల వివరాలకు అనుసంధానం చేయడం వల్ల నమోదు ప్రక్రియ తప్పనిసరి చేశారు. దీంతో మద్దతు ధర పొందేందుకు ఇది కీలకమైంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం కలిగినా పంటల నమోదు ప్రామాణికంగానే పరిహారం అందించనున్నారు.

2,93,248 మంది నుంచి వేలిముద్రల సేకరణ

పంటల నమోదు గడువు ముగిసినా, ఈకేవైసీ వివరాల సేకరణ కొనసాగుతోంది. 12 మండలాలు ఈకేవైసీ నమోదులో వెనుకబడి ఉన్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో 2,93,248 మంది రైతుల వేలిముద్రలు సేకరించగలిగారు. 4,10237 ఎకరాల్లోని పంటలు సాగు చేసే రైతుల ఈకేవైసీ పూర్తి చేయగా, మరో 69,277 మంది నుంచి వివరాలు సేకరించాల్సి ఉంది. త్వరలో లక్ష్యం పూర్తి చేస్తామని వ్యవసాయ శాఖ జేడీ త్రినాథస్వామి తెలిపారు.

ఇదీ పరిస్థితి
కవిటి, పాతపట్నం, హిరమండలం, వజ్రపుకొత్తూరు, పొందూరు, శ్రీకాకుళం, జి.సిగడాం, కంచిలి, గార, పలాస, రణస్థలం, సరుబుజ్జిలి మండలాలు వెనుకబడి ఉన్నాయి. అత్యధికంగా ఇచ్ఛాపురంలో 94.7 శాతం.. అత్యల్పంగా సరుబుజ్జిలిలో 77.8 శాతం ఈకేవైసీ పూర్తయింది.

పేదల ఇళ్లకు కళ..!

- వైకాపా హయాంలో అసంపూర్తిగా వదిలేసిన నిర్మాణాలపై దృష్టి
- మన ఇల్లు..మన గౌరవం పేరిట లబ్ధిదారులకు అవగాహన



'ఇల్లు కాదు..ఊళ్లు నిర్మిస్తున్నాం' అంటూ వైకాపా నాయకులు ఊదరగొట్టారు. జగనన్న కాలనీల పేరిట స్థలాల కేటాయింపు, లబ్ధిదారుల ఎంపిక, బిల్లుల చెల్లింపు వరకు అక్రమాలు చోటుచేసుకోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. వాటిని అలాగే వదిలేస్తే కేంద్రం నుంచి ఇళ్ల కేటాయింపులు, నిధుల మంజూరుపై ప్రభావం పడే అవకాశం ఉందని కూటమి ప్రభుత్వం గుర్తించింది. గత సర్కారు హయాంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఇటీవల 'మన ఇల్లు..మన గౌరవం' పేరిట కార్యక్రమం నిర్వహించింది. క్షేత్రస్థాయిలో గృహ నిర్మాణ సంస్థ అధికారులు లబ్ధిదారులను కలిసి ఇళ్లు కట్టుకోకుంటే ఎదురయ్యే పరిణామాలను వివరించారు.


న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం, సోంపేట

పేదల సొంతింటి కల సాకారం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గృహ నిర్మాణ పథకాన్ని అమలు చేస్తున్నాయి. అర్హులకు ఇళ్లు మంజూరు చేసి దశల వారీగా బిల్లులు చెల్లిస్తున్నాయి. వైకాపా ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)లో మంజూరైన ఇళ్లకు జగనన్న కాలనీ బోర్డులు పెట్టి తామే ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంది. అవన్నీ పూర్తయ్యేలా చూడాలని కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించింది. శ్లాబు దశలో ఉన్నవి వచ్చే నెలాఖరుకు.. మిగిలినవి 2025 మార్చి లోపు పూర్తిచేయాలని లక్ష్యం నిర్దేశించింది. ప్రతి రెండు కాలనీల బాధ్యతను ఒక అధికారికి అప్పగించింది.

అసంపూర్తి నిర్మాణాలపై ఆరా

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించడానికి వీలుగా అధికారులు జాబితా సిద్ధం చేశారు. మండలం, గ్రామాల పరిధిలో ఎన్ని ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయనే సమగ్ర సమాచారం సేకరించారు. సచివాలయానికి ఒక నోడల్ అధికారితో బృందాన్ని నియమించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు నిలిచిపోవడానికి గల కారణాలను తెలుసుకుంటున్నారు. అందుబాటులో ఉన్న నిర్మాణదారులను కలిసి తక్కువ మొత్తానికి పని చేసేలా మాట్లాడటం, సామగ్రి సమకూర్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. శ్లాబు దశలో ఉన్న ఇళ్లు అక్టోబరు చివరికి పూర్తి చేయడం కష్టమని.. ఇప్పటికే అప్పులు చేసి నిర్మించామని, ప్రభుత్వం సొమ్ము సమకూరిస్తే నవంబరు, డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేయగలమని లబ్ధిదారులు చెబుతున్నారు.


కవిటి మండలం బైరిపురం వద్ద పునాది దశలో ఇళ్లు



పూర్తి చేయకుంటే నష్టపోతారు..: గతంలో పని మొదలు పెట్టిన ఇళ్లకు సంబంధించిన గడువు త్వరలో ముగియనుంది. ప్రభుత్వ సూచనల మేరకు నిర్మాణాలు పూర్తి చేయకుంటే బిల్లులు నష్టపోతారు. భవిష్యత్తులో వారికి నిధులు రావు. కొత్త పథకంలో చేరడానికి అర్హత ఉండదు. లబ్ధిదారులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం 'మన ఇల్లు..మన గౌరవం' పేరిట లక్ష్యాన్ని నిర్దేశించింది. మార్చిలోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా కృషి చేస్తున్నాం.
- బి.నగేష్, పీడీ, గృహ నిర్మాణ సంస్థ, శ్రీకాకుళం

టెట్ నిర్వహణకు ఏర్పాట్లు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) అక్టోబరు 3 నుంచి నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఆన్‌లైన్‌లో పరీక్ష జరుగుతుందన్నారు. ఎచ్చెర్లలో శివాని, వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల, నరసన్నపేట మండలం గొట్టిపల్లి వద్ద కోర్ టెక్నాలజీ, బ్రహ్మపురలోని కళ్లికోట కళాశాలలో అయాన్ డిజిటల్ జోన్, చండీపదర్‌లోని ఎస్ఎంఐటీ డిగ్రీ ఇంజినీరింగ్ కళాశాల, బృందావన్ విహార్‌లోని అంకుష్పూర్ ఎస్ఎంఐటీలో పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారానికి 97031 48269, 79891 39860, 94940 94904, 91779 75250 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

జేడీగా త్రినాథస్వామి బాధ్యతల స్వీకరణ



నరసన్నపేట, న్యూస్‌టుడే: వ్యవసాయ శాఖ జేడీగా కె.త్రినాథ స్వామి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు జేడీగా వ్యవహరించిన కె.శ్రీధర్ ఉద్యోగ విరమణ పొందారు. త్రినాథ స్వామి జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలోని వనరుల కేంద్రంలో ఉప సంచాలకులుగా పనిచేస్తున్నారు.

ట్రాక్‌లో పడేదెప్పుడు..?

రన్నింగ్ ట్రాక్ రానుందని ఏడాది కిందట క్రీడాకారులు సంబరపడ్డారు. పరుగు సాధనకు ఇబ్బందులు తొలగినట్లేనని భావించారు. అనుకున్నట్లుగానే పనులూ ప్రారంభమయ్యాయి. అధికారుల పర్యవేక్షణ లోపం, గుత్తేదారు జాప్యం కారణంగా నిర్దేశిత గడువు దాటిపోయినా కొలిక్కి రాలేదు. నెలలు గడిచినా నిరీక్షణ తప్పడం లేదు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

కేఆర్ మైదానంలో నత్తనడకన అభివృద్ధి పనులు


కోడిరామ్మూర్తి క్రీడా మైదానంలో నిర్మాణంలో ఉన్న రన్నింగ్ ట్రాక్

శ్రీకాకుళం నగరంలోని కోడిరామ్మూర్తి మైదానం ఆధునికీకరణ పనులు గత ప్రభుత్వ వైఫల్యంతో నిలిచిపోయాయి. మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పుణ్యమా అని స్టేడియంలో పరుగు సాధన చేసేందుకు కూడా వీలు కాని పరిస్థితి తలెత్తింది. రెండేళ్లుగా క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన పంచాయత్ యువక్రీడా ఖేల్ అభియాన్(పైకా) నిధుల వడ్డీ డబ్బులతో మైదానంలో రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని డీఎస్ఏ అధికారులు గతేడాది సెప్టెంబరులో ప్రతిపాదించారు. దానికి అప్పటి కలెక్టర్ శ్రీకేశ్ బి.లఠ్కర్ అనుమతి తెలిపారు. అనంతరం అంచనాలు రూపొందించి పనులు చేపట్టే బాధ్యతను ఆర్‌అండ్‌బీశాఖకు అప్పగించారు. ఆ మేరకు 8 వరుసలతో మూడు పొరలుగా 400 మీ. ట్రాక్ ఏర్పాటుకు ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.28.50 లక్షలు అంచనాలు రూపొందించారు. నవంబరులో పనులు ప్రారంభించారు. మూడు నెలల్లోగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు సూచించినా ఇంత వరకు పూర్తి కాలేదు.

అందుబాటులోకి తీసుకొస్తాం..: కోడిరామ్మూర్తి మైదానంలో 400 మీ. రన్నింగ్ ట్రాక్ పనులు జరుగుతున్నాయి. ఇటీవల మట్టి వేయించాం. వర్షాల కారణంగా పనుల్లో జాప్యం జరుగుతోంది. ఎత్తుపల్లాలను చదును చేయిస్తాం. వీలైనంత త్వరగా పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం.
- రవినాయక్, ఈఈ, ఆర్‌అండ్‌బీ, శ్రీకాకుళం

లోతుగా.. ఎత్తుపల్లాలతో..

ప్రారంభంలో అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారు సాధారణ గ్రావెల్‌తో ట్రాక్ పనులు చేపట్టి మమ అనిపించారు. దీనిపై డీఎస్ఏ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో గుత్తేదారుడు నాణ్యమైన ఎర్రమట్టిని తీసుకొచ్చి ట్రాక్‌పై వేశారు. దాన్నీ సక్రమంగా రోలింగ్ చేయకపోవడంతో ట్రాక్ ఎత్తుపల్లాలుగా తయారైంది. అలా ఉంటే పరుగు పెట్టే సమయంలో క్రీడాకారులకు ఇబ్బంది అవుతుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో పాటు మైదానం కంటే ట్రాక్ లోతుగా ఉందని, సరిచేయకుంటే రూ.లక్షలు బూడిదలో పోసిన పన్నీరులా మారిపోతాయని అంటున్నారు. అక్టోబరులో ఈ మైదానంలో రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా పోటీల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. ఈలోగా అందుబాటులోకి తీసుకొస్తే ఉపయుక్తంగా ఉంటుందని వ్యాయామోపాధ్యాయ సంఘాల సభ్యులు, క్రీడాకారులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు శ్రీకారం

విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్ వెల్లడి


రాజకీయ పక్షాల సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులు ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ సూచించారు. విశాఖ కలెక్టరేట్‌లో సోమవారం వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటికి ముగుస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఉపాధ్యాయుల ఓటరు జాబితా తయారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు.

'శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో 34 మంది ఈఆర్వోలు, 187 మంది ఏఈఆర్వోలను నియమితులయ్యారు. ఈఆర్వోగా విశాఖ డీఆర్వో వ్యవహరిస్తారు. అర్హులైన ఉపాధ్యాయులు ఆయా జిల్లాల పరిధిలో నియమితులైన అధికారులకు ఓటు దరఖాస్తులు అందజేయవచ్చు. ఆన్‌లైన్ https://eoandhra.nic.in లో ఫారం-19 సమర్పించవచ్చు.

అర్హులు వీరే..

◆ ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు సెకండరీ స్థాయి (ఆరో తరగతికి పైబడిన) పాఠశాలల్లో రెగ్యులర్ లేదా అడ్‌హాక్ ప్రాతిపదికన పని చేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు. ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు స్వీయ ధ్రువీకరణ పత్రం, సంబంధిత హెచ్‌వోడీలు ఇచ్చే ధ్రువపత్రం, డీఈవో కౌంటర్ సైన్ చేసిన పత్రాలు సమర్పించాలి. ◆ కళాశాల అధ్యాపకులు ఆర్జేడీల నుంచి, వర్సిటీ స్థాయిలో వీసీ నియమించిన అధికారుల నుంచి కౌంటరు సైన్ తీసుకోవాలి. గత ఆరేళ్లలో (01.11.2024 నుంచి వెనక్కి లెక్క పెడితే) సెకండరీ స్థాయికి మించిన ఏ విద్యా సంస్థలో అయినా మూడేళ్లకు తగ్గకుండా పని చేసిన ఉపాధ్యాయులు మాత్రమే అర్హులు. గతంలో ఓటరుగా ఉన్న వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి' అని విశాఖ కలెక్టర్ వివరించారు.

ఓటు నమోదుకు గడువు: నవంబరు 6	ముసాయిదా జాబితా నవంబరు 23	అభ్యంతరాల స్వీకరణ డిసెంబరు 9 వరకు	తుది ఓటరు జాబితా డిసెంబరు 30

నేడు, రేపు ఆదిత్యునికి కిరణ స్పర్శ

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానంలో మంగళవారం ఆదిత్యుని సూర్యకిరణాలు తాకే అద్భుత దృశ్యం ఆవిష్కారం కానుంది. అక్టోబరు 1, 2 తేదీల్లో మూలవిరాట్‌కు కిరణ స్పర్శ ఉంటుందని ప్రధానార్చకుడు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు.

తహసీల్దారుల బదిలీలు 6లో
రైతేరాజు 6లో

కబడ్డీ.. కబడ్డీ..



పాఠశాల క్రీడా సమాఖ్య పోటీల్లో జిల్లా క్రీడాకారులు కూత పెట్టి కదం తొక్కారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల వేదికగా అండర్ 14, 17, 19 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బేస్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నలుమూలల నుంచి సుమారు వెయ్యిమంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ, వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి.రమణ, ఎం.సాంబమూర్తి, గ్రిగ్స్ కార్యదర్శి కె.మాధవరావు, సాధు శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, యాళ్ల పోలినాయుడు, ఎన్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

వివరాలు చెబితే ఖాతా ఖాళీ..!



నేరగాళ్లు చేసే మోసాలపై ప్రకటన

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: క్రెడిట్ కార్డు సంబంధిత మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాల సమాచారం, క్రెడిట్, డెబిట్ కార్డ్ నంబర్, యూపీఐ. పిన్, ఓటీపీ, సీవీవీ వంటి వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింక్‌లు నొక్కద్దన్నారు. బ్యాంకు సిబ్బంది క్రెడిట్ కార్డ్, డెబిట్‌కార్డ్‌కు సంబంధించిన వ్యక్తిగత వివరాలు అడగరన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు కాల్ చేయాలని, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

మద్యం దుకాణాలు నేడు తెరుచుకుంటాయా?

★ విధులకు వచ్చేది లేదంటున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు ★ ప్రత్యామ్నాయ ఏర్పాట్ల అన్వేషణలో ఎక్సైజ్ అధికారులు

పాతశ్రీకాకుళం, ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం తెరుచుకునే విషయంలో సందిగ్ధం నెలకొంది. ప్రస్తుత ప్రభుత్వం మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్ల కొనసాగింపు విషయంలో స్పష్టత ఇవ్వకపోవడంతో తమ ఒప్పంద గడువు సోమవారంతో ముగిసిందని, మంగళవారం నుంచి దుకాణాలు తెరవలేమని ఉన్నతాధికారులకు సైతం తేల్చిచెప్పేశారు. దీంతో మంగళవారం ప్రభుత్వ మద్యం దుకాణాలు తెరిపించే విషయంలో ఎక్సైజ్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇప్పటికిప్పుడు కానిస్టేబుళ్లను గానీ, వేరే సిబ్బందితో గానీ తెరిపించినా, బాటిళ్ల స్కానింగ్, నగదు చెల్లింపులు ఇతరత్రా సమస్యలు అధిగమించలేమని అధికారులు సంశయం వ్యక్తం చేస్తున్నారు. 2019లో జగన్ ముఖ్యమంత్రి అయ్యాక అప్పటి వరకు జిల్లాలో ఉన్న 235 ప్రైవేటు దుకాణాలను రద్దు చేసి, వాటి స్థానంలో ప్రభుత్వ మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. వాటిల్లో అమ్మకాలు చేసేందుకు ఒక్కో దుకాణానికి ఒక్కో సూపర్‌వైజర్, దుకాణంలో అమ్మకాల కోసం ఇద్దరేసి సేల్స్‌మెన్లను ఒప్పంద ప్రాతిపదికన ప్రభుత్వం నియమించింది. ఇలా జిల్లాలో 193 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సుమారు 800 మంది నాలుగున్నరేళ్లుగా విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. వీళ్లకు ప్రతి ఏటా పునర్నవీకరణ చేస్తూ రాగా, గత ఏడాది చేసిన కొనసాగింపు సెప్టెంబర్ నెలాఖరుతో ముగిసింది. తాజాగా తమ సేవల విషయంలో ప్రభుత్వం నుంచి కచ్చితమైన హామీ రాలేదు. దీంతో అక్టోబర్ ఒకటి నుంచి దుకాణాలు తెరవలేమని ఆయా సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్ల సంఘ నాయకులు స్పష్టం చేయడంతో మంగళవారం ఏం జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.

నేడు చెకుముకి పోటీలు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం(అక్టోబరు 1న) జిల్లాలోని అన్ని మండలాల్లో ఉదయం 10గంటలకు చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహించనున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుప్పిలి కామేశ్వరరావు, గొంటి గిరిధర్, చెకుముకి సైన్స్ సంబరాల జిల్లా కన్వీనర్లు పి.కూర్మారావు, వ్.సాయిశ్రీనివాస్‌శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులతో కూడిన జట్లు, ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉద్యమ అభిమానులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అగ్గిపుల్లలతో అద్భుత కళారూపం



మందస పరిధిలోని డీవీఎల్‌పురం గ్రామానికి చెందిన టి.వేణుగోపాల్ కాల్చి పడేసిన అగ్గిపుల్లలు, చీపురు పుల్లలతో తయారు చేసిన ఈఫిల్ టవర్ నమూనా అందరినీ ఆకట్టుకుంటోంది. ఐటీఐ పూర్తిచేసి రైల్వేలో ఉద్యోగం చేసిన ఈయన మూడేళ్ల కిందట ఉద్యోగ విరమణ చేశారు. ఇంటి వద్ద ఖాళీ సమయంలో ఇటువంటి ఆకృతులు తయారు చేస్తుంటానని వేణుగోపాల్ పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, పోలాకి

అందరికీ కొత్తమ్మతల్లి దర్శనం


బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఈ ఏడాది రాష్ట్రప్రభుత్వ పండుగగా గుర్తించిన నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ అమ్మవారి దర్శనం లభించేలా పోలీసులు పని చేయాలని ఎస్పీ మహేశ్వరరెడ్డి సూచించారు. కొత్తపేటలోని ఓ కల్యాణ మండపంలో సోమవారం అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, కొత్తపేట, సంతబొమ్మాళి మార్గంలో వాహనాలను మళ్లించేందుకు అవకాశాలు పరిశీలించాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ముందస్తు చర్యలు అవసరమని చెప్పారు. ఏఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆదాయం అందించే కంది..!


లింగాలవలస వద్ద కంది పంట

న్యూస్‌టుడే, జలుమూరు

పప్పు దినుసుల ధరలు ఆకాశాన్ని తాకుతున్న ప్రస్తుత రోజుల్లో కంది పంట వేస్తే రైతుకు అధికంగా కలిసి వస్తుందంటున్నారు జలుమూరు మండలం లింగాలవలస గ్రామానికి చెందిన రైతు రెడ్డి కృష్ణ. తనకు ఉన్న మెట్ట పొలంలో 20 సెంట్ల విస్తీర్ణంలో గత రెండేళ్లుగా కంది పండిస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో వేసుకుంటే తక్కువ పెట్టుబడితో 180 రోజుల్లో పంట చేతికి అందుతుంది. 20 సెంట్ల విస్తీర్ణంలో విత్తనం దగ్గర నుంచి పంట చేతికి అందేవరకు రూ.2,500 వరకు ఖర్చవుతుంది. 175 కిలోల వరకు గింజలు వస్తాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో ధర రూ.70 ఉంది. పెట్టుబడి పోను రూ.10 వేల వరకు ఆదాయం ఉంటుందని రైతు తెలిపారు.



సాగు లాభదాయకమే: మెట్ట ప్రాంతంలో కంది పంట సాగు లాభదాయకమే. పెట్టుబడి చాలా తక్కువ. ఎరువులు, పురుగు మందులు అంతగా అవసరం ఉండదు. ఖరీఫ్‌లో సాగు చేస్తే నీటి తడులు అవసరం ఉండదు. గత రెండేళ్లుగా కంది పండించి వ్యాపారులకు, రైతు బజార్లలో విక్రయించి ఆదాయం పొందుతున్నాను. -రెడ్డి కృష్ణ, రైతు లింగాలవలస

సస్య రక్షణ చర్యలు ఇలా..: ఎకరాకు 3 కిలోల విత్తనాలు వేసుకోవాలి. విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. మొక్కకి, మొక్కకి 20 సెం.మీ., వరుసకి వరుసకి 1 మీటరు దూరం ఉండేలా చూడాలి. దుక్కిలో 15 కిలోల యూరియా, 20 డీఏపీ వేయాలి. మొక్క దశలో ఆకు చుట్టు పురుగు ఆశిస్తుంది. దాని నివారణకు క్లోరోపైరిపాస్ లీటరు నీటికి 2 మి.లీ. మందు కలిపి పిచికారీ చేయాలి. పూత, పిందె దశలో కాయతొలుచు పురుగు ఆశిస్తుంది దాని నివారణకు ఎస్పేట్ పౌడర్ లీటరు నీటికి 2 గ్రాములు, క్లోరోపైరిపాస్ లీటరు నీటికి 2 మి.లీ. కలిపి పిచికారీ చేస్తే మంచిదని వ్యవసాయాధికారి కె.సురేష్ తెలిపారు.

రైతేరాజు

రైతులు పండించే పంటల్లో ఎరువుల వినియోగం, కలుపు నివారణ, సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆమదాలవలస కేవీకే సస్యపోషణ శాస్త్రవేత్త ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. రైతులు చరవాణిలో అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిలా ఇచ్చారు. –న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

కాయదొలుచు పురుగును నివారిస్తే మంచి దిగుబడి


బొంతులో మొక్కజొన్నను ఆశించిన కాయదొలుచు పురుగు

సారవకోట, న్యూస్‌టుడే: మొక్కజొన్నలో కాయదొలుచు పురుగును నివారిస్తే మంచి దిగుబడి వస్తుందని ఏవో కేసీహెచ్.వెంకటరావు తెలిపారు. ఏడాది పొడవునా మొక్కజొన్న సాగు చేయవచ్చునన్నారు. ఎకరాకు 8 కిలోల విత్తనాలు సరిపోతాయని, చివరి దుక్కిలో 50 కిలోల డీఏపీ, 20 కిలోల చొప్పున యూరియా, పొటాష్ ఎరువులు వేయాలన్నారు. పంట కాలంలో 3 నుంచి 4 సార్లు 35 కిలోల చొప్పున యూరియా వేసుకుంటే సరిపోతుందన్నారు. పైరుకు పురుగు సోకకుండా రెండు, మూడు సార్లు 750 మి.లీ. చొప్పున వేపనూనె పిచికారీ చేసుకోవాలని, కాయదొలుచు పురుగు ఆశిస్తే ఇమామెక్టిన్ బెంజియేట్ 100 గ్రాముల మందుతో పాటు 750 మి.లీ. వేపనూనె కలిపి 200 లీటర్ల నీటిని పిచికారీ చేసి నివారించుకోవాలని ఆయన సూచించారు.

పంటల్లో కలుపు.. నివారణ చర్యలు



సమస్య: ఖరీఫ్ వరి సాగులో తెల్లదోమ దుబ్బుల దగ్గర కనిపిస్తోంది. దీని వల్ల మొక్కలు ఎండిపోయినట్లు అయిపోతున్నాయి. దీని నివారణకు చర్యలు తెలపండి
- ఎస్.రాములు, పారాపురం, కొత్తూరు

సమాధానం: దుబ్బులు దగ్గర తెల్లదోమ ఆశిస్తే మొక్క నుంచి రసాన్ని పీల్చేస్తాయి. దీని నివారణకు ఇమెడాక్లోప్రేడ్, ఎసిఫేట్ మందు 300 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి మొదలు తడిసేలా పిచికారీ చేయాలి.

? : చెరకు పంటలో తీగ జాతి కలుపు మొక్కలు అధికంగా ఉన్నాయి. వీటి నివారణకు చర్యలు తెలపండి.
- ఎస్.నారాయణరావు, కొత్తవలస,ఆమదాలవలస

● : చెరకు పంటలో తీగజాతి కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నప్పుడు ఆల్‌మిక్స్ 8 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేస్తే కలుపు మొక్కల్ని అరికట్టడంతో పాటు అధిక దిగుబడులు పొందేందుకు అవకాశం ఉంటుంది.

? : పత్తిలో ఆకుల కింద భాగంలో తెల్లదోమ అధికంగా కనిపిస్తుంది. దీని వల్ల మొక్కలు గిడసబారిపోవడంతో పాటు ఆకుల పరిణామం తగ్గిపోతోంది. నివారణకు చర్యలు తెలపండి.
–కె.అప్పలనాయుడు, మురపాక, లావేరు మండలం

● : తెల్ల దోమ ఆకుల కింద భాగం నుంచి రసాన్ని పీల్చేస్తుంది. దీంతో మొక్కలు గిడసబారిపోయి, ఆకుల పరిమాణం తగ్గిపోయి రంగు మారిపోతాయి. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ. లేదా అసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా టయామితగ్జోమ్ 0.2 గ్రాముల మందు ఏదో ఒకటి మార్పు చేసుకుంటూ 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేస్తే నివారించవచ్చు.

యాజమాన్య విధానాలతో సుడిదోమ దూరం


సుడిదోమ పోటుకు గురైన వరి పంట

జలుమూరు, పాతపట్నం, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో వేసే వరి పంటలో రైతులు యాజమాన్య విధానాలు పాటిస్తే సుడిదోమ, ఇతర చీడ పీడల నుంచి రక్షించుకోవచ్చని వ్యవసాయాధికారి కె.సురేష్ తెలిపారు. నాట్లు వేసేటప్పుడు తూరు, పడమర దిశలుగా కాలి బాటలు తీసుకోవాలి. ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ. కాలిబాట అవసరం. గాలి, వెలుతురు మొక్కకు సమృద్ధిగా అందడంతో పాటు చీడపీడలు దరి చేరవు. తెల్లదోమ వ్యాపించే సమయంలో పొలంలో గుండ్రంగా సుడులు ఏర్పడతాయి. తెల్లదోమ (సుడిదోమ) ప్రారంభ దశలో మొక్క మొదటి భాగంలో ఉన్నప్పుడు వేప నూనె ఎకరాకు లీటరు పిచికారీ చేస్తే సరిపోతుంది. తెల్లదోమ ఎక్కువగా ఉన్నట్లు గుర్తిస్తే బిప్రోపిజన్ 100 మి.లీ. లేదా ఎస్పేట్ 300 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి మొక్క తడిసేలా పిచికారీ చేయాలని ఆయన తెలిపారు.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

పంటల్లో ఆశించే చీడపీడలను నివారించేందుకు ఎటువంటి చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చో తెలుసుకునేందుకు ఆమదాలవలస కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష, 9493838010 చరవాణి నంబరుకు సంప్రదించాలి.

ప్రాణదాతలూ.. ముందుకు రండి

▶ జిల్లాలో రక్త నిల్వల కొరత ▶ అపోహలతో వెనకడుగు వేస్తున్న ప్రజలు

ప్రమాదాల్లో గాయపడిన వారికి, కొన్ని రుగ్మతలకు రక్తం అవసరం ఎంతో ఉంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అలాంటి బాధితులకు సమయానికి రక్తం అందిస్తే పునర్జన్మ ప్రసాదించినట్లే. దీనిపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేస్తున్నా.. రక్తనిధి కొరతలోనే ఉంది. జిల్లాకు 30 వేల యూనిట్లు అవసరమైతే, 16వేల యూనిట్లే రక్తనిల్వలు కలిగి ఉన్నాయి. - న్యూస్‌టుడే, గుజరాతీపేట(శ్రీకాకుళం)



రెడ్‌క్రాస్ రక్తనిధి

వెనక్కి లాగుతున్న భయం

అవగాహన కల్పిస్తున్నా.. రక్తదానం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయన్న భయమే చాలా మందిని వెనకడుగు వేసేలా చేస్తోంది. వైద్య నిపుణులు, పలుమార్లు దానం చేసినవారు చైతన్యం కలిగిస్తున్నా.. మార్పు రావడం లేదు. దీంతో ఆపదలో ఉన్న వారికి కావాల్సిన గ్రూపు రక్తం రక్తనిధి కేంద్రంలో దొరకడం లేదు. జిల్లా జనాభా 29 లక్షల్లో ఒక్క శాతం మంది ముందుకొచ్చినా.. కొరత అధిగమించొచ్చు.

వీరు అనర్హులు ..

మధుమేహం, రక్తపోటు, రక్తం 12 శాతంలోపు ఉన్నవారు, గుండెపోటు, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు, గర్భిణులు. జ్వరంతో బాధపడుతున్నవారు, మలేరియా, టైఫాయిడ్, మత్తు పదార్థాలు తీసుకునే వారు రక్తదానానికి అనర్హులు.


రక్తదాతలను అభినందిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఒక యూనిట్‌తో ముగ్గురికి ప్రాణం

మూడు నెలలకు ఒకసారి నిరభ్యంతరంగా రక్తదానం చేయవచ్చని చాలాసార్లు రక్తదానం చేసిన దాతలు చెబుతున్నారు. ఒక్క యూనిట్‌తో ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. రక్తం సేకరించిన అనంతరం అందులో తెల్ల, ఎర్ర రక్తకణాలు, ప్లాస్మా వేరు చేసి అవి అవసరమైన బాధితులకు అందజేస్తారు. రక్తఫలికలు సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్లేట్‌లెట్స్ పడిపోయి విషమ పరిస్థితిలో ఉన్న వారికి ఎస్‌డీపీ(సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్) అందిస్తే కోలుకుంటారు. అయితే వైద్యుడి సూచనపై సంబంధిత గ్రూపు రక్తదాత నుంచి వీటిని సేకరించాల్సి ఉంటుంది. ఈ విధంగా 87 మంది రక్త ఫలికాలు అందించి ప్రాణదాతలయ్యారు.

రక్తనిధి కేంద్రాల వివరాలు

❖ రెడ్‌క్రాస్ రక్తనిధి ❖ ప్రభుత్వ సర్వజనాసుపత్రి రక్తనిధి ❖ టెక్కలిలోని ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రి, ❖ పాలకొండ, పాతపట్నం ఆసుపత్రులు ❖ శ్రీకాకుళం నగరంలో లయన్స్ రక్తనిధి కేంద్రం ❖ న్యూ శ్రీకాకుళం

35 సార్లు రక్తదానం చేశా

20 ఏళ్ల నుంచి రక్తదానం చేస్తున్నా.. ఇప్పటి వరకు 35 సార్లు ఇచ్చాను. 18 శిబిరాలు ఏర్పాటు చేశాను. –కుమిలి రాజేశ్, పొందూరు మండలం

ఆవశ్యకత వివరిస్తున్నాం

రక్తదానంపై విస్తృతంగా అవగాహన కలిగిస్తున్నాను. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో కళాశాలలు, స్వచ్ఛంద సంస్థల వద్దకు వెళ్లి ఆవశ్యకత వివరించడంతోపాటు రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నాం.
–పెంకి చైతన్య, రెడ్‌క్రాస్ రక్తదాన ప్రతినిధి

స్ఫూర్తిగా తీసుకోవాలి

స్వచ్ఛంద రక్తదానం చేస్తున్న వారిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు రక్తదాతలు అన్ని వేళల అందుబాటులో ఉంటున్నారు. రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ తరఫున రక్తదాతలందరినీ అభినందిస్తున్నాం.
– పి.జగన్మోహనరావు, రెడ్‌క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

వసతిగృహం మూసివేయాల్సిందే


వసతిగృహాన్ని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

గార, న్యూస్‌టుడే: గార మండలం శ్రీకూర్మంలో టీటీడీ సత్రం ఎదురుగా ఉన్న వసతిగృహాన్ని జిల్లా బాలల సంరక్షణ కమిటీ సోమవారం తనిఖీ చేసింది. వసతి గృహానికి ఎలాంటి అనుమతులు లేవని మూసివేయాలని నిర్వాహకులకు తెలిపింది. విద్యా సంవత్సరం మధ్యలో మూసివేస్తే విద్యార్థుల చదువులపై ప్రభావం పడుతుందని, సమయం ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు, నిర్వాహకులు కమిటీని కోరగా కలెక్టర్‌కు తెలియజేస్తామన్నారు. జిల్లా బాలల సంక్షేమ సమితి ఛైర్మన్ శ్రీలక్ష్మి, జిల్లా ప్రొఫెషనల్ అధికారి రవికుమార్, కమిటీ సభ్యులు రమణమూర్తి, గన్నెప్పడు, సీడీపీవో రాధామాధవి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముల తనిఖీ


నాయకుల సమక్షంలో వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: త్రైమాసిక తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఈవీఎం గోదాములను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం తనిఖీ చేశారు. గోదాములకు వేసిన సీళ్లను వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో తెరిపించి పరిశీలించారు. ఎన్నికల్లో వినియోగించిన, రిజర్వులో ఉంచిన ఈవీఎంలను సీరియల్ నంబర్ నియోజకవర్గాల వారీగా ఏయే ప్రదేశాల్లో ఉంచారనే విషయాన్ని డీఆర్‌వో అప్పారావును అడిగి తెలుసుకున్నారు. ఈవీఎం గోదాముల పక్కన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీ ప్రతినిధులు పీఎంజే బాబు(తెదేపా), సురేష్ సింగ్(భాజపా), రౌతు శంకరరావు(వైకాపా), రట్టి ప్రకాశరావు (సీపీఎం), కేఎల్‌ఎస్ కుమారి (కాంగ్రెస్) తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	215	235

తహసీల్దార్ల బదిలీ

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: జిల్లాలోని పలువురు తహసీల్దారులకు స్థాన చలనం కలిగింది. కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారు ఉన్నారు.

సంఖ్య	పేరు	మండలం
1.	బి.పాపారావు	మెళియాపుట్టి
2.	ఎన్.హనుమంతురావు	కలెక్టరేట్ హెచ్.సెక్షన్ సూపరింటెండెంట్
3.	బి.రాజేశ్వరరావు	పరిపాలనాధికారి ఆర్డీవో కార్యాలయం టెక్కలి
4.	డి.రామమూర్తి	కేఆర్ఆర్‌సీ టెక్కలి డివిజన్
5.	బి.ప్రకాశరావు	పరిపాలనాధికారి ఆర్డీవో కార్యాలయం పలాస
6.	బి.ఎస్.ఎస్.సత్యనారాయణ	కలెక్టర్‌రేట్ డి.సెక్షన్ సూపరింటెండెంట్
7.	ఎస్.హైమావతి	మందస
8.	ఎన్.రమేష్	కంచిలి
9.	కె.రవిచంద్ర	హిరమండలం
10.	డి.సీతారామయ్య	వజ్రపుకొత్తూరు
11.	పి.సోమేశ్వరరావు	నందిగాం
12.	ఆర్.రమేష్‌కుమార్	సంతబొమ్మాళి
13.	టి.కల్యాణ చక్రవర్తి	పలాస
14.	వై.వి.పద్మావతి	బూర్జ
15.	జె.ఈశ్వరమ్మ	ఎల్.ఎన్.పేట

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు


⊶ రిమాండ్‌కు తరలింపు ⊶ వివరాలు వెల్లడించిన ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో గార, లావేరు మండలాల్లో ఇటీవల జరిగిన నాలుగు చోరీ కేసులకు సంబంధించి ఇద్దరు నిందితులను పట్టుకున్నట్లు కేవీ మహేశ్వరరెడ్డి చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ★ గార మండలం జోగి పంతులపేట గ్రామానికి చెందిన పిట్టరమణ ఇంట్లో శ్రీకాకుళం అలికాం కాలనీకి చెందిన నాగళ్ల నాగరాజు అనే యువకుడు తులం బంగారం దొంగిలించాడు. ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ పైడపునాయుడు గార పోలీసులతో గాలించి గార మండలం బూరవల్లి కూడలి వద్ద నాగరాజును పట్టుకున్నారు. పశువుల వ్యాపారం సరిగాలేక, అప్పులు తీర్చలేక దొంగతనానికి పాల్పడినట్లు అతడు అంగీకరించాడు. గతంలో కొన్నిచోట్ల చోరీ చేసిన సొత్తును అలికాం ఏపీజీబీవీ బ్రాంచ్‌లో తాకట్టు పెట్టినట్లు చెప్పడంతో ఏడు తులాల బంగారం, కిలో వెండి అక్కడ నుంచి స్వాధీనం చేసుకున్నారు. ★ ఈ నెల 27వ తేదిన లావేరు మండలం బెజ్జిపురానికి చెందిన తాళాబత్తుల సూరిబాబు ఇంట్లో ఉన్న 18 తులాలకు పైగా బంగారం, రూ.17 వేల నగదు మాయమవడంతో జేఆర్‌పురం సీఐ అవతారం, ఎస్ఐ లక్ష్మణరావు దర్యాప్తు చేసి బెజ్జిపురం గ్రామంలో వడ్రంగిగా పనిచేస్తున్న జవ్వాది మహేష్ అనే యువకుడిని నిందితుడిగా గుర్తించి పట్టుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

సంయుక్తంగా గంజాయిపై దాడులు: ఒడిశా పోలీసుతో సంయుక్తంగా గంజాయిపై దాడులు చేస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. చెక్‌పోస్టులు, టోల్‌ప్లాజాలు వద్ద నిఘా వేసినట్లు వెల్లడించారు. 20 రోజుల్లో 300 కిలోల గంజాయి సీజ్ చేశామన్నారు. జిల్లాలో గంజాయికి సంబంధించిన క్రయ, విక్రయదారులు మొత్తం 55 మంది పరారీలో ఉన్నారని వెల్లడించారు.

ప్రాణం తీసిన చుట్ట


వరహాలమ్మ (పాత చిత్రం)

పొందూరు, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చుట్ట కాల్చే అలవాటే ఆ వృద్ధురాలి నిండు ప్రాణం బలితీసుకుంది. ఆమె ఎప్పటిలాగే చుట్ట కాలుస్తుండగా ఒంటి మీద ఉన్న దుస్తులపై అది పడి ఒక్కసారిగా మంటలు చెలరేగి 90 శాతం ఒళ్లు కాలింది. వెంటనే ఆమెను స్థానిక ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడే మృతి చెందింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పొందూరు మండలం లోలుగు గ్రామంలో జడ్డు వరహాలమ్మ(93) తన అల్లుడు లోలుగు సూర్యనారాయణ ఇంటిలో ఉంటుంది. భర్తతో పాటు ఒక్కగానొక్క కుమార్తె మృతి చెందడంతో అక్కడే ఉంటుంది. సోమవారం ఎప్పటిలానే చుట్ట కాలుస్తుండగా నోటిలో నుంచి ఒంటిపై ఉన్న దుస్తులపై పడింది. ఫ్యాను గాలికి చుట్ట నుంచి మంటలు చెలరేగి దుస్తులకు అంటుకున్నాయి. ఒక్కసారిగా మంటలు పెద్దవై శరీరానికి అంటుకున్నాయి. కుటుంబ సభ్యులు మంటలను అదుపు చేసేలోగా శరీరం కాలిపోయింది. సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్సై వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళంలోని సర్వజనాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

నరసన్నపేట, న్యూస్‌టుడే: నరసన్నపేటకు సమీపంలో జడూరు కూడలి వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సిర్లపి రామయ్య (65) అనే వృద్ధుడు ప్రాణాలు కోల్పోయారు. నరసన్నపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జడూరు కూడలి వద్ద రామయ్య రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం వైపు నుంచి టెక్కలి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. రామయ్య స్వగ్రామం పోలాకి మండలం రేగుపాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు విద్యార్థుల సాయం




విజయవాడ వరద బాధితుల కోసం సోంపేట వివేకానంద విద్యాకేంద్రం విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.25 వేలు సమకూర్చారు. సోమవారం మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు తెదేపా నాయకుడు చిత్రాడ శేఖర్‌కు పాఠశాల కరస్పాండెంట్ బి.పల్లభరావు, విద్యార్థులు మొత్తాన్ని అందజేశారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి పంపించేందుకు చర్యలు చేపడతామని తెదేపా నాయకులు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి

ప్రత్యేక అవసరాల పిల్లలను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా పని చేయాలని సమగ్ర శిక్షా ఐఈఆర్‌టీ జిల్లా సమన్వయకర్త బుడుమూరు గోవిందరావు పేర్కొన్నారు. మండల కేంద్రం వజ్రపుకొత్తూరు ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు యాప్ ద్వారా బోధనలపై అవగాహన కల్పించారు. ఎంఈవోలు దశరథ, వెంకటరమణ, మండల సమన్వయకర్త జోగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు



భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి



సమస్య వింటున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూముల ఆక్రమణలను తొలగించి ప్రజా అవసరాలకు వినియోగించుకునేలా అధికార యంత్రాంగం చొరవ తీసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అధికారులకు సూచించారు. వజ్రపుకొత్తూరు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో తహసీల్దార్ పి.బాల, ఎంపీడీవో ఈశ్వరమ్మ పర్యవేక్షణలో సోమవారం నిర్వహించిన మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు సమస్యలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ భూములు, చెరువు గర్భాలు, గ్రామ కంఠాలు ఆక్రమణలపై ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మీ కోసంలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కారం చూపి ప్రజలకు నమ్మకం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఉప తహసీల్దార్ గిరిరాజు, ఈవోపీఆర్డీ తిరుమలరావు, వివిధ శాఖాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస మండలం చినంచలలో అనారోగ్యంతో ఇటీవల మరణించిన బమ్మిడి మార్కండేయ, పొట్నూరు లక్ష్మి కుటుంబాలను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం పరామర్శించారు. పైల చక్రధర్‌రావు, తలగాన నర్సింహమూర్తి, ప్రభుదాసు, తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్యం బక్కచిక్కుతోంది..

న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

పోషకాహార లోపంతో చిన్నారులు బలహీనంగా మారుతున్నారు. పేదరికం, తల్లిదండ్రుల్లో అవగాహన లేకపోవడం లాంటి కారణాలతో పిల్లలు బక్కచిక్కుతున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చేపట్టిన సమగ్ర సర్వే ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఆ సర్వే ప్రకారం కాశీబుగ్గ ఐసీడీఎస్ పరిధిలో తీవ్ర పోషణ లోపం ఉన్నవారు 109, స్వల్ప పోషణ లోపం ఉన్నవారు 404 మందిగా గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 7002 మంది పిల్లలపై సర్వే చేశారు. బాలల బరువు, ఎత్తు, శారీరక పరిస్థితిని ప్రత్యేక యాప్‌లో పొందుపరిచారు. ప్రతి నెలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.



పలాస మండలం తోసరాడ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి బరువు తూస్తున్న సిబ్బంది (పాత చిత్రం)

పునరావాసం కేంద్రం ఉన్నా..

పోషకాహార లోపం తీవ్రంగా ఉన్న చిన్నారుల కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో పోషకాహార పునరావాస కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అక్కడికి పిల్లలను తీసుకెళ్తే కనీసం పదిహేను రోజుల పాటు వారిని గమనిస్తూ ప్రత్యేక ఆహారం అందిస్తారు. చిన్నారులతోపాటు సహాయకులకు భోజనం పెడుతూ.. వాళ్లకి రోజుకు రూ.100 చొప్పున ఇస్తారు. ఇంత మంచి అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నా.. పోషకాహార పునరావాస కేంద్రాలపై తల్లిదండ్రులు పెద్దగా ఆసక్తి చూపించడంలేదు. వీటిపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కాశీబుగ్గ ఐసీడీఎస్ పరిధిలో..

కాశీబుగ్గ ఐసీడీఎస్ పరిధిలోని పలాస, వజ్రపుకొత్తూరు, పలాస-కాశీబుగ్గ పురపాలకల్లో మొత్తం 186 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 0 నుంచి ఆరేళ్లలోపు పిల్లలు 7002 మంది ఉండగా.. 6953 మంది బరువు, ఎత్తు కొలిచారు. వీరిలో ఆరు నెలల నుంచి ఏడాది వయసున్నవారు 1099 మంది, ఏడాది నుంచి మూడేళ్లలోపు పిల్లలు 3266 మంది, కేంద్రాలకు వచ్చే 3 నుంచి 5 ఏళ్లలోపు వారు 1949 మంది ఉన్నారు. మిగిలిన చిన్నారులు 639 మంది 0 నుంచి 6 నెలలోపు వారే.

పిల్లలు (లేని వారు)	పోషణ లోపం తీవ్రం	పోషణ లోపం స్వల్పం
వయసుకు తగ్గ బరువు	46	212
ఎత్తుకు తగ్గ బరువు	63	192
వయసుకు తగ్గ ఎత్తు	146	548

చిన్నారులపై ప్రత్యేక దృష్టి..

పిల్లల్లో పోషణలోపం, ఎత్తుకు తగ్గ బరువు, వయసుకు తగ్గ ఎత్తు లేనివారు వివరాలు తెలుసుకున్నాం. వారిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. పోషకాహార మాసోత్సవాల్లో తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం. లోపం మరీ ఎక్కువున్న పిల్లలను శ్రీకాకుళంలోని పోషకాహార పునరావాస కేంద్రానికి పంపిస్తున్నాం. దీనిపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. – వై.లావణ్య, సీడీపీవో, కాశీబుగ్గ ఐసీడీఎస్

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం: 9440437129
పలాస: 8008574279
కవిటి గ్రామీణం: 8309638875
పలాస గ్రామీణం: 7386409826
కంచిలి గ్రామీణం: 9704568738

సమస్య: అన్నపూర్ణ ఆశ్రమం వద్ద వీధి దీపం వెలగట్లేదు. – స్థానికులు

సమాధానం: సిబ్బందిని పంపించి మరమ్మతులు చేస్తాం. – జి.అవినాష్ ఏఈ, పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం – న్యూస్‌టుడే, పలాస

? దానిస్‌పేట కూడలి నుంచి చెరువు వైపునకు వెళ్లే మెట్ల మార్గం అపరిశుభ్రంగా ఉంది. – ఎస్.ఆది, ఇచ్ఛాపురం

● మెట్లు శుభ్రం చేయించడం జరుగుతుంది. – పి.ఉమేంద్రకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇచ్ఛాపురం – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

? పలాస మండలం గంగువాడ ప్రధాన వీధిలో కాలువలు లేక ఇబ్బంది పడుతున్నాం. – స్థానికులు

● త్వరలోనే కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరిస్తాం. – ఫల్గుణరావు, పంచాయతీ కార్యదర్శి, కేదారిపురం – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

స్పందించారు.. పైపులు వేశారు

స్పందనకు వందనం



పలాసకాశీబుగ్గ పురపాలక సంఘంలో ముత్యాలమ్మ కోనేరు, నెహ్రూ పార్కులో మరమ్మతు పనులు మొదలెట్టారు. ఆదివారం ఈనాడులో 'ఉప్పొంగుతున్నారు'.. అధ్వానం 'చేశారు' శీర్షికతో ప్రచురితమైన కథనంపై పురపాలక సంఘం కమిషనర్ ఎన్.రామారావు స్పందించారు. చెరువులో తవ్వేసిన ప్రాంతంలో పైపులు వేసే పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. పైపులు వేసిన తర్వాత మట్టిని పూర్తిగా కప్పేసి కాలిబాట పనులకు మరమ్మతులు చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

అల్లుకున్న నిర్లక్ష్యం

కవిటి మండలంలోని బైరిపురం, రాజపురం రహదారులోని పలు స్తంభాలకు పనికిరాని మొక్కలు, పొదలు అల్లుకుపోయి నిత్యం విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించట్లేదని వాపోతున్నారు. దీనిపై ఏఈ నేతాజీని వివరణ కోరగా రెండు రోజుల్లో మొత్తం తొలగిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



మంచినీటికి ఇక్కట్లు..



ఇచ్ఛాపురం పురపాలకసంఘం పదో వార్డు పెద్దకులవీధిలో గత కొంతకాలంగా మంచినీటి బోరు మరమ్మతులకు నోచుకోవట్లేదు. కుళాయి నీరు రెండురోజులకో సారి వస్తుండటంతో స్థానికులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోరు బాగుచేయాలని వేడుకుంటున్నారు. మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని పుర ఏఈ పి.కామేశ్వరరావు తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ముళ్లపొదలు తొలగించరూ..

ఇచ్ఛాపురం పట్టణ ముఖద్వారంలో ఉన్న బాహుదా ఛానల్ వంతెన ఇరుకుగా ఉండటంతోపాటు ఇరువైపులా ముళ్లపొదలు పెరగడంతో వాహన చోదకులు గాయపడుతున్నారు. నిర్వహణ పనులు చేపట్టి పొదలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై ర.భ.శా ఏఈ పి.మోహనరావును వివరణ కోరగా.. ముళ్లపొదల తొలగింపు చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు ప్రతిపాదనలు పంపించామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



సుందరీకరణ కలేనా..!



మందస మండలం అంబుగాం చెరువును అమృత్ సరోవర్ కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేపట్టేందుకు గత ప్రభుత్వం నిర్ణయించింది. చెరువులో శివుని విగ్రహం ఏర్పాటుతో పాటు పరిశుభ్రంగా తీర్చిదిద్దడం, గట్టుపై మొక్కలు పెంచడం వంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పది శాతం పనులు కాకుండానే ఆగిపోయాయి. రెండేళ్లు అవుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు నిధులు వస్తాయని అంటున్నారని, వస్తే మళ్లీ ప్రారంభిస్తామని సర్పంచి వెంకమ్మ తెలిపారు. – న్యూస్‌టుడే, హరిపురం (మందస)

అందరి సహకారంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న బళ్ల గిరిబాబు

పలాస, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో ప్రాధాన్యతా క్రమంలో అందరి సహకారంతోనే అభివృద్ధి పనులు చేపడుతున్నామని పురపాలక సంఘం అధ్యక్షుడు బళ్ల గిరిబాబు అన్నారు. సోమవారం పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం సాధారణ సమావేశం నిర్వహించారు. తెదేపా కౌన్సిలర్ జి.సూర్యనారాయణ మాట్లాడుతూ.. తన వార్డులో అభివృద్ధిపనుల కోసం కౌన్సిల్‌లో తీర్మానం చేస్తున్నారే తప్ప టెండర్లు పిలవటం లేదని, పిలిచినా పనులు చేపట్టే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఈ విషయంపై పుర అధ్యక్షుడు మాట్లాడుతూ ఏ వార్డులో ప్రతిపాదన చేసినా తాను పార్టీలకతీతంగా పనులు చేపడుతున్నట్లు, ఇందులో పక్షపాతం లేదని వివరించారు. సమావేశంలో పలు సమస్యలపై కౌన్సిలర్లు ఏకరువు పెట్టారు. వైస్‌ఛైర్మన్ ఎం.సురేష్‌బాబు, కౌన్సిలర్లు డి.ఆనంద్, డి.శ్రీకాంత్, టి.ఆశారాణి, బి.రేవతి, మాధురి, ఎస్.గీత, కోఆప్షన్ సభ్యులు, కమిషనర్ ఎన్.రామారావు, డి.ఇ.ఇ కనకరాజు, పట్టణ ప్రణాళిక అధికారి అప్పలరాజు, సీనియర్ అసిస్టెంట్ మోనీషా పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మహాసభలకు ఆహ్వానం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయసంఘం ఏపీటీఎఫ్ వజ్రోత్సవ వేడుకలతో పాటు, 20వ విద్య వైజ్ఞానిక మహాసభలను ఈ నెల 6వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరుగనున్నాయని సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఇచ్ఛాపురం మండల విద్యాశాఖాధికారి కె.అప్పారావుకు ఆహ్వాన పత్రికను అందించారు. పాఠశాల హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులను ఆహ్వానించారు. విజయనగరంలో జరిగే ఈ వేడుకల్లో మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు, విద్యావేత్తలు పాల్గొంటారని ఇచ్ఛాపురం మండల సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకర్, జి.ఉమాశంకర్ అన్నారు.

ఆ పనులు వృథా.. ఆమోదించలేం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించ తలపెట్టిన పురపాలక సంఘం అభివృద్ధి పనులు వృథాగా భావిస్తున్నాం. వాటిని ఆమోదించలేమని పుర కౌన్సిలర్లు పలువురు స్పష్టం చేశారు. పురాధ్యక్షురాలు పిలక రాజలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగిన పుర కౌన్సిల్ సాధారణ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ.. పురపాలకసంఘ కార్యాలయంలో మరుగుదొడ్ల మరమ్మతులు, అదనపు సౌకర్యాల కోసం రూ.11.50 లక్షలు ప్రణాళికేతర నిధుల నుంచి వ్యయం చేసేందుకు, కార్యాలయ అంతర్గత రహదారులు, కొత్త ద్వారాల ఏర్పాటుకు రూ.14.50 లక్షల ఖర్చు చేసే విషయమై అజెండాల్లో చేర్చడాన్ని తిరస్కరించారు. మాస్టర్ ప్లాన్ ముసాయిదాను పరిశీలించి, పబ్లికేషన్ చేసేందుకు శ్రీకాకుళం అర్బన్ డవలెప్‌మెంట్ అథారిటీ (సుడా)కు పంపే అంశాన్ని వాయిదావేశారు. మిగిలిన ఆరు అంశాలను ఆమోదించారు. రూ.5లక్షలతో ఎల్‌ఈడీ కొత్త దీపాల కొనుగోలుకు ఆమోదిస్తూ, పట్టణంలో వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారించాలంటూ పలువురు కౌన్సిలర్లు కోరారు. కార్యక్రమంలో పుర అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.



మెప్మా సభ్యుల ఉత్పత్తుల ప్రదర్శనను ప్రారంభిస్తున్న పురాధ్యక్షురాలు రాజలక్ష్మి

మెప్మా బజారు ప్రారంభం

మెప్మా మహిళలు రూపొందించిన గృహోపకరణాలు, ఇతర వస్తువుల తయారీకి మంచి గిరాకీ ఉండాలని పురాధ్యక్షురాలు పిలక రాజలక్ష్మి అన్నారు. తెదేపా నాయకులు కాళ్ల జయిదేవు, కౌన్సిలర్ కాళ్ల దిలీప్, జనసేన నాయకులు దాసరి రాజు తదితరులతో కలిసి ఆమె మెప్మా బజారును ప్రారంభించారు.

పాఠశాలకు సామగ్రి వితరణ



సామగ్రితో ఉపాధ్యాయులు, ఎస్‌బీఐ అధికారులు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పలాస శాఖ ఆధ్వర్యంలో కాశీబుగ్గ చిన్నబాడాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు రూ.6 లక్షల విలువైన సామగ్రిని సోమవారం అందజేశారు. రెండు కంప్యూటర్లు, బీరువాలు, 20 టేబుళ్లు, 20 కుర్చీలు తదితర సామగ్రిని పంపిణీ చేశారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సూర్యనారాయణ, తెదేపా పట్టణ శాఖ అధ్యక్షుడు బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

వజ్రపుకొత్తూరు గ్రామీణం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం ఉద్దానం కూర్మనాథపురం గ్రామానికి చెందిన అర్జి కామరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో అతడి కుటుంబానికి ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు రూ.20వేలు సాయం అందించారు.

* కవిటి మండలం డి.గొనపపుట్టుగకు చెందిన పాపారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెంది ఆర్థిక కష్టాలతో సతమతమవుతున్న ఆ కుటుంబానికి కవిటికి చెందిన ఎస్‌జీఎఫ్ సభ్యులు రూ.6 వేలతో పాటు రెండు నెలలకు సరిపడ నిత్యావసర సరకులు అందజేశారు.

గిరిజన బతుకులపై అధ్యయనం

పలాస నియోజకవర్గం పరిధిలోని పలు గిరిజన గ్రామాల్లో ప్రగతిశీల మహిళా సంఘం సభ్యులు సోమవారం పర్యటించారు. మందస మండలంలోని కొండలోగాం, కుల్లోగాం, బంసుగాం, పలాస మండలం లొత్తూరు, పెదగంతర, చినగంతర, పెదపలియా, జెన్నాసాయి, చింతవీధి, తుసరాడ గ్రామాల్లో గిరిజన మహిళల జీవన విధానంపై అధ్యయనం చేపట్టారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.గంగాభవాని, కార్యదర్శి పి.పద్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కుసుమ, కోశాధికారి బి.జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.


– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం, మందస



స్వచ్ఛత.. అందరి బాధ్యత

పరిశుభ్రత ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని సాధించవచ్చునని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో సోమవారం పలుచోట విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు ప్రజా సంఘాల నాయుకులు మొక్కలు నాటారు, ప్రతిజ్ఞలు చేశారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం, పలాస, వజ్రపుకొత్తూరు



ఇచ్ఛాపురంలో విద్యార్థుల ప్రదర్శన



పలాసలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

అవీ..ఇవీ..అన్నీ

వైభవంగా దీపారాధన

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని డోకులపాడు గణేశ్ మందిరం వద్ద సోమవారం జనసేన అధ్యక్షుడు లండి గిరిబాబు ఆధ్వర్యంలో దీపారాధన పూజలు నిర్వహించారు. తిరుమల లడ్డూ కల్తీపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్ష విరమణ సందర్భంగా విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఓం నమో నారాయణ మంత్రాన్ని పఠించారు. కూటమి నాయకులు అంబటి రామకృష్ణ, వడ్డి బాలు, ఉప్పాడ రంజీత్, మహిళలు పాల్గొన్నారు.



విమర్శలు హాస్యాస్పదం

కాశీబుగ్గ, న్యూస్‌టుడే:. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించడం హాస్యాస్పదమని మున్సిపల్ మాజీ ఛైర్మన్ కోత పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. రాజకీయ విమర్శలు తప్ప వ్యక్తిగత విమర్శలు చేయడం తగదన్నారు. వైకాపా అధిష్ఠానం వద్ద మెప్పు కోసం అప్పలరాజు తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

వేగ నియంత్రికలు ఏర్పాటు చేయాలి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో ఒకటైన రైల్వేస్టేషన్‌రోడ్డులో ఉన్న పుర ప్రాథమిక పాఠశాల విద్యార్థుల భద్రత కోసం వేగనియంత్రికలను ఏర్పాయాలని అధికారులకు పుర ఉపాధ్యక్షురాలు ఉలాల భారతిదివ్య వినతి పత్రం ఇచ్చారు. ఫకీరుపేటలో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.15లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఫకీరుపేట మండపం వద్ద కుళాయినీటి నిర్వహణ కోసం గతంలో ఏర్పాటుచేసిన గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. వాటిపై ఇనుప తలుపులు అమర్చాలని వినతి పత్రంలో కోరారు. కాగా రహదారి నిర్మాణ పనులను 16వ వార్డు తెదేపా బాధ్యుడు నాగరాజు పాత్రో కూడా పరిశీలించి, ఏఈ పి.కామేశ్వరరావుకు విన్నవించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

పలాస, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో 18వ వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని 18వ వార్డు తెదేపా ఇన్‌ఛార్జి హెచ్.మురళీమోహన్ విన్నవించారు. ఈ మేరకు పురపాలక కమిషనర్ ఎన్.రామారావుకు సోమవారం సమస్యల వినతిపత్రాన్ని అందించారు

పోషకాహారంతో ఆరోగ్యం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆరోగ్యకరంగా ఎదిగేందుకు పోషకాహారం ముఖ్యమని, అదే సమయంలో మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో పి.నాగరాణి అన్నారు. ఇచ్ఛాపురం కాదాలక్ష్మీ కాంతమ్మ పుర బాలికోన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నష ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని బిలాయిలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తూ జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న కోడ శారదను సోమవారం ఆంధ్రా సాహిత్య సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. దివ్యాంగురాలైనప్పటికీ కుంగిపోకుండా విద్యార్థులు ఉన్నతికి పాటుపడుతుండటం ఆదర్శనీయమని వక్తలు కొనియాడారు. పలు ప్రవాస ఆంధ్ర, తెలుగు సంఘాలు ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.



గుంతల రహదారిపై అవస్థలు



తిరుమల థియేటర్ వద్ద ప్రమాదకరంగా రోడ్డు

న్యూస్‌టుడే, సోంపేట

సోంపేట ప్రధాన మార్గం గోతులతో అధ్వానంగా తయారైంది. ఏడేళ్ల కిందట రహదారి నిర్మించినప్పటికీ పనుల్లో నాణ్యత లోపం కారణంగా తక్కువ సమయంలోనే మరమ్మతులకు గురైంది. గత ప్రభుత్వంలో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో పలుచోట్ల ఏర్పడిన గుంతలతో వాహనాల రాకపోకలకు సమస్యలు తలెత్తుతున్నాయి. మురుగు నీటి వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షం పడితే రోడ్డు మీదుగానే వరదనీరు ప్రవహించి అదనపు సమస్యలు తలెత్తుతున్నాయి.

సీసీ రోడ్డుతో సరిపెట్టారు..

ప్రధాన రోడ్డు అభివృద్ధికి గత ప్రభుత్వంలో రూ.4 కోట్లతో పనులు చేపట్టారు. రోడ్డుతో పాటు ఇరువైపులా మురుగు కాలువల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. నిర్మాణంలో నెలకొన్న ఇబ్బందులతో ప్రారంభంలోనే రోడ్డు ధ్వంసమైంది. దీంతో తారురోడ్డుపై సీసీ రోడ్డు నిర్మించి అధికారులు చేతులు దులుపేసుకున్నారు. డ్రైనేజీ నిర్మాణానికి స్థలం లేకపోవడంతో ఒక్కోచోట ఒక్కోవిధంగా పనులు చేపట్టారు. తిరుమల, శ్రీనివాస థియేటర్ల వద్ద పెద్ద గోతులు ఏర్పడటంతో రోజుకు నాలుగైదు ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. బీఎన్నార్ షాపింగ్‌మాల్ వద్ద మురుగునీరంతా రోడ్డు మీదుగా ప్రవహిస్తుండటంతో రహదారి దెబ్బతింది. సోమేశ్వర ఆలయం వీధి నుంచి చిన్నపల్లి వీధి వరకు రహదారి మరింత అధ్వానంగా తయారైంది. గోతులు పూడ్చి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



సోమేశ్వర ఆలయం కూడలి వద్ద ఇలా..

మరమ్మతులు చేపట్టాలి...

ప్రధాన రహదారి మరమ్మతులకు గురవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోజంతా వాహనాల రాకపోకలతో రోడ్డు రద్దీగా ఉంటుంది. ఏమరపాటున వాహనాలు నడిపితే గోతుల్లో పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గుంతల్ని పూడ్చి మరమ్మతులు చేపట్టాలి. – కె.శ్రీనివాసరావు, సోంపేట

ప్రతిపాదనలు పంపాం..

రహదారి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే నిర్వాహణ పనులు చేపడతాం. తాత్కాలికంగా గోతులు పూడ్చేందుకు చర్యలు చేపడతాం. – మోహన్‌రావు, ఏఈఈ, ఆర్‌అండ్‌బీ

ఆపస్ కార్యవర్గ ఎన్నిక

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస మండలానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కొయిరి షణ్ముఖరావు, ప్రధాన కార్యదర్శిగా గిన్ని అప్పలరాజును ఎన్నుకున్నారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావుకు నూతన కార్యవర్గ జాబితా అందజేశారు. ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కీలు సోమేశ్వరరావు, బి.శంకరం, ఎం. తారకేశ్వరరావు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల నిర్ణయంపై ఆందోళన

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం రైలు నిలయంలో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ రైల్వే రిజర్వేషన్లు లభించేవి. తాజా ఉత్తర్వుల మేరకు 3వ తేదీ నుంచి ఒక పూట మాత్రమే రిజర్వేషన్ల సేవలు ఉంటాయని ఇందుకు సంబంధిచిన నోటీసు రైలునిలయం రిజర్వేషన్ల విభాగం వద్ద ప్రదర్శించడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. పాత విధానంలోనే సేవలు కొనసాగించాలని జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు కట్టా సూర్యప్రకాశరావు రైల్వే ఉన్నతాధికారులతో పాటు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

? గొల్లవూరు సమీపంలో వంశధార ప్రధాన ఎడమ కాలువపై వంతెన కూలిపోవడంతో తాత్కాలిక మార్గం ఏర్పాటు చేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. – లక్ష్మణరెడ్డి, గొల్లవూరు

● ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. కాలువలో నీరు తగ్గితే శాశ్వత వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం.
– సతీష్, ఏఈ, ర.భ.శాఖ, నందిగాం
– న్యూస్‌టుడే, నందిగాం

రాజుల చెరువును అభివృద్ధి చేయాలి



ఎమ్మెల్యే రమణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న తెదేపా శ్రేణులు

నరసన్నపేట, న్యూస్‌టుడే: రాజుల చెరువును అభివృద్ధి చేయాలని నరసన్నపేట పట్టణానికి చెందిన పలువురు ఎమ్మెల్యే రమణమూర్తిని కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఫిర్యాదులు స్వీకరించారు. [illegible] నిర్మాణం పనులు పూర్తి చేయాలని తెదేపా నాయకులు జామి వెంకటరావు, సరిపల్లి మధు, గొద్దు చిట్టిబాబు వినతిపత్రం అందించారు. కంబకాయ రహదారి దయనీయంగా మారిందని విశ్రాంత ఉపాధ్యాయుడు పాగోటి అప్పలనాయుడు ఫిర్యాదు చేయగా, భోగినవలస ఉపాధి క్షేత్ర సహాయకుడు అవినీతిపై దర్యాప్తు చేయాలని గ్రామస్థులు అర్జీ అందించారు.



మెళియాపుట్టి: గణపతిరావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ఉపాధ్యాయులే మార్గదర్శకులు

మెళియాపుట్టి, జలుమూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులే మార్గదర్శకులని ఎమ్మెల్యే గోవిందరావు అన్నారు. చాపర జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎ. గణపతిరావు ఉద్యోగ విరమణ సందర్భంగా మెళియాపుట్టిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ● ఉపాధ్యాయ వృత్తిలో సేవలే గుర్తింపునిస్తాయని మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు దుంగ స్వామిబాబు, బుక్క లక్ష్మణరావు అన్నారు. జలుమూరు మండలం లింగాలవలస ఉన్నత పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కణితి చిట్టెమ్మ దంపతులను స్థానికంగా సన్మానించారు. ఎంఈవోలు మాధవరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

పోలాకిలో 'స్వచ్ఛతా హీ సేవా'

పోలాకి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎమ్మెల్యే రమణమూర్తి అన్నారు. సోమవారం పోలాకిలో నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మొక్కలు నాటారు. తహసీల్దారు ఎం.సురేష్, ఇంఛార్జి ఎంపీడీవో సూర్యప్రకాష్, సర్పంచి పి.దానమ్మ పాల్గొన్నారు.

మొండి గోడలు.. మోక్షానికి ఎదురుచూపులు

వివిధ దశల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు

న్యూస్‌టుడే, జలుమూరు, సారవకోట, నరసన్నపేట, నరసన్నపేట గ్రామీణం, పోలాకి

నరసన్నపేట నియోజకవర్గంలో సగానికి పైగా ప్రభుత్వ కార్యాలయాల భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. మొండి గోడలతో మోక్షం కోసం ఎదురు చూస్తున్నాయి. జగన్ సర్కారు హయాంలో గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినప్పటికీ బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో 50 శాతం భవనాలు వివిధ దశల్లో ఆగిపోయాయి. పునాదులు దాటని వాటిని అప్పటి వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టగా, శ్లాబ్‌లు పూర్తి చేసుకున్నవి ప్రస్తుతం అలాగే దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో పనులు పూర్తవుతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పరిస్థితిపై కథనం.



చిక్కాలవలసలో పిల్లర్ల స్థాయిలో వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం

సగానికి పైగా అసంపూర్తిగానే..

● జలుమూరు మండలానికి 24 గ్రామ సచివాలయాలు మంజూరు కాగా 15 వినియోగంలోకి వచ్చాయి. 9 వివిధ దశల్లో ఉన్నాయి. 24 రైతు సేవాకేంద్రాలకు 15 ఉపయోగిస్తున్నారు. మిగతా 9 అసంపూర్తిగా మిగిలాయి. 20 వెల్‌నెస్ సెంటర్లకు 7 చోట్ల మాత్రమే పనులు పూర్తి చేశారు. మర్రివలస, నగిరికటకం, లింగాలవలసలో భవన నిర్మాణాలు పునాదులు దాటలేదు.

బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో..

● నరసన్నపేట మండలంలో 24 గ్రామ సచివాలయాలు మంజూరయ్యాయి. వాటిలో 19 సచివాలయాలు వినియోగంలోకి వచ్చాయి. మిగతా 5 వివిధ దశల్లో ఉన్నాయి. 24 రైతు సేవా కేంద్రాలకు 17 చోట్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 7 వివిధ దశల్లో ఉన్నాయి. 22 వెల్‌నెస్ సెంటర్లకు 11 వినియోగంలోకి వచ్చాయి. మిగతా 11 బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో వివిధ దశల్లో ఉన్నాయి.

● పోలాకి మండలంలో గ్రామ సచివాలయాలు 23 మంజూరయ్యాయి. వాటిలో 22 చోట్ల పనులు పూర్తవగా. గుప్పిడిపేటలో అసంపూర్తిగా ఉండిపోయింది. 19 వెల్‌నెస్ సెంటర్లకు 7 చోట్ల వినియోగంలోకి వచ్చాయి. 12 చోట్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. 23 రైతు సేవా కేంద్రాలకు 7 మాత్రమే వినియోగంలోకి వచ్చాయి. 16 వివిధ దశల్లో ఉన్నాయి.

● సారవకోట మండలానికి సంబంధించి 20 గ్రామ సచివాలయాలకు గాను 12 వినియోగంలోకి వచ్చాయి. 8 వివిధ దశల్లో ఉన్నాయి. రైతు సేవాకేంద్రాలు 20 మంజూరు కాగా 13 కేంద్రాలు పూర్తయ్యాయి. 5 చోట్ల వివిధ దశల్లో ఉండగా అవలంగి, బుడితి కేంద్రాల పనులు స్థల వివాదంతో ప్రారంభం కాలేదు. 16 వెల్‌నెస్ సెంటర్లకు 7 వినియోగంలోకి వచ్చాయి. 8 వివిధ దశల్లో ఉన్నాయి. కుమ్మరిగుంటలో నిర్మాణం ప్రారంభం కాలేదు.



చివరి దశలో నిలిచిపోయిన జలుమూరు గ్రామ సచివాలయ భవనం

త్వరితగతిన పూర్తిచేస్తాం... భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేస్తాం. పనులు జరిగిన వరకు బిల్లులు చెల్లించాం. ఇది ప్రభుత్వ పరిధిలో ఉంది. పునాదుల దశ దాటని నిర్మాణాలను గత ప్రభుత్వం సమయంలోనే నిలిపివేశాం. మిగతా దశల్లో ఉన్న వాటిని పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నాం.
– జి.సత్యంనాయుడు, డీఈఈ, పంచాయతీరాజ్ శాఖ

తాగునీరు.. అందని తీరు

ఎల్ఎన్‌పేట మెగా రక్షిత మంచినీటి పథకం నుంచి శ్యామలాపురం వరకు మాత్రమే తాగునీరు అందుతోంది. మిగిలిన 20 గ్రామాలకు సరఫరా కావడం లేదు. దీంతో గతేడాది కరకవలస వద్ద మరో ట్యాంకు, పంపు హౌస్ ఏర్పాటు చేసి ఆ గ్రామాలకు తాగునీరు అందజేస్తామని అధికారులు పనులు చేపట్టారు. సంపు నిర్మాణం చేపట్టి ఏడాది గడిచినా పరిస్థితి మారలేదని పలువురు వాపోతున్నారు. తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఆర్.కాశీప్రసాదరావు చెప్పారు. – న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట



దారి.. మెరుగుపడదా మరి



సంతబొమ్మాళి మండలం సవరపేట- కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు అధ్వానంగా తయారవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. కనీసం మరమ్మతులైనా చేపట్టాలని కోరుతున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కోటబొమ్మాళి ర.భ.శాఖ జేఈ హరనాథ్ తెలిపారు. – న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

చెత్త కుప్పలు.. ముప్పు తిప్పలు

జలుమూరు మండలం జర్జంగి- పింద్రువాడ రహదారిలో శ్రీముఖలింగం గ్రామానికి సమీపంలోని బిందు తీర్థం వద్ద వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో ముక్కు మూసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ పి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. సిబ్బందికి తెలియజేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, జలుమూరు



పనిచేయదు.. యంత్రాంగానికి పట్టదు



నందిగాం మండలంలోని దిమ్మిడిజోల గ్రామం అంగన్వాడీ కేంద్రానికి ఎదురుగా ఉన్న బోరు రెండు నెలలుగా పనిచేయడం లేదు. రక్షిత మంచినీటి పథకం ద్వారా స్థానికంగా తాగునీరు అందుతున్నప్పటికీ అరకొరగా సరఫరా అవుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. తక్షణమే చేతిపంపునకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో రాజారావు వద్ద ప్రస్తావించగా సిబ్బందికి తెలియజేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, నందిగాం

గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కొత్తమ్మతల్లి జాతర మహోత్సవాల నేపథ్యంలో కోటబొమ్మాళిలో రాష్ట్రస్థాయి పురుషుల కబడ్డీ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఇచ్ఛాపురం- శ్రీకాకుళం జట్ల మధ్య పోటీలను మంత్రి తిలకించారు. ఇచ్ఛాపురం కేవలం ఒక్క పాయింటుతో శ్రీకాకుళంపై విజయం సాధించింది. టెక్కలిపై గుంటూరు, కోడిరామ్మూర్తి స్టేడియం శ్రీకాకుళంపై కృష్ణా జట్టు, అక్కులపేటపై తూర్పుగోదావరి గెలుపొందాయి. తెదేపా నేతలు కింజరాపు ప్రసాదరావు, గోవిందరాజులు, బోయిన రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక



పాతపట్నం: ప్రతిభ చూపిన క్రీడాకారులతో ప్రిన్సిపల్ అర్చన, వ్యాయామోపాధ్యాయులు

టెక్కలి పట్టణం, పాతపట్నం, పోలాకి, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు టెక్కలి మండలం లింగాలవలస జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ధనలక్ష్మి, వినీత్, పవన్‌కుమార్, మహి, దుర్గాప్రసాద్ జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటినట్లు ప్రధానోపాధ్యాయుడు బి.వైకుంఠరావు తెలిపారు. ● పాతపట్నం గురుకుల పాఠశాల క్రీడాకారులు రాష్ట్రస్థాయి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వి.అర్చన తెలిపారు. ఎం.మాధవి, వై.యమున, జి.జ్యోతి, కె.ఇందు, సీహెచ్.మీనాక్షి, డి.యమిమ, కె.హరీష, కె.నవ్య, కె.కృపారాణి, సాహితి జిల్లాస్థాయిలో ప్రతిభ చూపినట్లు వ్యాయామోధ్యాయులు ఎన్.దుర్గమ్మ, ఎస్.త్రివేణి చెప్పారు. ● పోలాకి మండలం గంగివలస కేజీబీవీ విద్యార్థులు 13 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయిని కె.శారద పేర్కొన్నారు.

శిరీష కంచు మోత



ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: అండర్-23 ఓపెన్ అథ్లెటిక్స్ జాతీయ పోటీల్లో ఎల్ఎన్‌పేట మండలం కోవిలాం గ్రామానికి చెందిన ముగడ శిరీష కంచు మోత మోగించింది. బీహార్‌లో శనివారం జరిగిన మహిళల 400 మీటర్ల పరుగు పందెంలో శిరీష మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకుంది. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆమెను అభినందించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

సారవకోట, న్యూస్‌టుడే: సెప్టెంబర్ నెల 28 నుంచి తన కుమార్తె కనిపించడం లేదని మండలంలోని అలుదు పంచాయతీ లోని ఓ గ్రామానికి చెందిన మహిళ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వి.లక్ష్మీనారాయణ చెప్పారు. బాలిక సమీపంలోని ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. 27వ తేదీన పాఠశాలకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. పాఠశాలకు వెళ్తానని 28వ తేదీన ఇంటి నుంచి బయలుదేరిన బాలిక తిరిగి ఇంటికి రాలేదని పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బస్సు నుంచి జారిపడి మహిళకు గాయాలు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలి- పూండి మార్గంలో శ్రీరంగం గ్రామం వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో వజ్రపుకొత్తూరు మండలం పొల్లాడకు చెందిన మహిళ జి.సుశీల గాయపడింది. పొల్లాడ నుంచి శ్రీరంగం వరకు బస్సులో వచ్చిన ఆమె బస్సు దిగే క్రమంలో అదుపుతప్పి కిందపడింది. ముఖంపై గాయాలవడంతో అదే బస్సులో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

గోనె సంచుల లారీ బోల్తా



జలుమూరు, న్యూస్‌టుడే: జలుమూరు మండలం లింగాలవలస పెట్రోలు బంకు వద్ద సోమవారం తెల్లవారుజామున గోనె సంచుల లారీ బోల్తా పడింది. కోలకతా నుంచి నారాయణవలస వస్తున్న వాహనాన్ని డ్రైవరు టీ తాగేందుకు పక్కన ఆపేందుకు ప్రయత్నించగా.. ఒక్కసారిగా పక్కకు ఒరిగిపోయి బోల్తా పడింది. రహదారి పక్కన మురుగు కాలువలపై పలకలు విరిగిపోవడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెప్పారు. ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.

ఈశాన్యేశ్వరుడిని తాకిన సూర్యకిరణాలు



జలుమూరు, న్యూస్‌టుడే: శ్రీముఖలింగేశ్వరస్వామి ప్రధాన ఆలయంలోని ఈశాన్యేశ్వరుడిని సోమవారం ఉదయం 7 గంటల సమయంలో సూర్యకిరణాలు తాకాయి. ఈ దృశ్యాన్ని చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

దరఖాస్తులు ఆహ్వానం

భామిని, సీతంపేట, న్యూస్‌టుడే: పారాలీగల్ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి తెలిపారు. కొత్తూరు, హిరమండలం, భామిని మండలాల నివాసితులు అర్హులన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అక్టోబర్ 5 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

భూ వివాదంపై ఇరువర్గాల ఫిర్యాదు

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం బోరభద్ర గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలి భర్త చిన్నారావు తన స్థలాన్ని కబ్జా చేశారని అదే గ్రామానికి చెందిన గూట్ల వైకుంఠరావు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మరోవైపు తన స్థలాన్ని గూట్ల వైకుంఠరావు దౌర్జన్యంగా అక్రమించారని, చర్యలు తీసుకోవాలని చిన్నారావు జిల్లా కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

నందిగాం: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.విలియం అన్నారు. మండలంలోని లఖిదాసుపురం జడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. హెచ్ఎం కృష్ణారావు పాల్గొన్నారు.

2న వసతి గృహ నిర్మాణానికి శంకుస్థాపన

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మినీ స్టేడియం సమీపంలో వసతి గృహం నిర్మాణానికి ఈ నెల 2న శంకుస్థాపన జరగనున్నట్లు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు పాల్గొంటారని చెప్పారు. అనంతరం ఆల్‌ఆంధ్ర రహదారి కూడలి వద్ద బహిరంగ సభ ఉంటుందన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

సారవకోట : ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యంగా పని చేయాలని ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ హరిబాబు కోరారు. మండలంలోని వడ్డినవలస గ్రామానికి చెందిన యువరైతు ఇప్పిలి రామ్మోహనరావు ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.



కలెక్టర్‌కు వినతి

హిరమండలం, న్యూస్‌టుడే: మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని జడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు కోరారు. ఈ మేరకు సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సుభలయ ఆర్‌ఆర్ కాలనీలో శివాలయం నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని, నవగుడ పాఠశాలలో అదనపు భవనంతో పాటు రక్షణ గోడ ఏర్పాటుచేయాలని కలెక్టర్‌కు తెలిపారు.

నీలమణిదుర్గ హుండీ ఆదాయం రూ.2,48,773



పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి హుండీ ఆదాయం రూ. 2,48,773 వచ్చినట్లు దేవాదాయ శాఖ ఈవో టి.వాసుదేవరావు పేర్కొన్నారు. 30 రోజులకు గానూ వచ్చిన ఆదాయాన్ని సోమవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించినట్లు తెలిపారు. ఆలయ అర్చకులు టి.రాజేష్, జి.సంతోష్‌కుమార్, వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవదాయ సహాయ కమిషనర్ కార్యాలయం పర్యవేక్షకులు జి.వి.బి.ఎస్.రవికుమార్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పాతపట్నం

ఇల్లు గడవడం కష్టమై వ్యక్తి ఆత్మహత్య

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న ఓ వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. విశాఖ నగరం దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కోటబొమ్మాళికి చెందిన ఎస్.నీలయ్య (45) అగనంపూడి దరి డొంకాడ కాలనీలో కుటుంబంతో నివాసముంటున్నారు. ఇటీవల పనులు లేకపోవడంతో కుటుంబ పోషణ భారమైంది. ఇల్లు గడవడం కష్టంగా మారడంతోపాటు చిన్న చిన్న అప్పులతో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. నీలయ్యకు ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. భార్య జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోండి

నరసన్నపేట, న్యూస్‌టుడే: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.లత సూచించారు. డా.బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో సోమవారం కార్యశాల జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. సమన్వయకర్త అజయ్‌కుమార్, నిర్వాహకుడు అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ లత

పనులు ప్రారంభం

స్పందనకు వందనం

హిరమండలం : జిల్లేడుపేట రహదారి పనులను అధికారులు ప్రారంభించారు. రోడ్డు సమస్యపై ఈనాడులో వచ్చిన వార్తలపై అధికారులు స్పందించారు. ఎంపీపీ టి.మేనక మండల పరిషత్తు నిధులు రూ.4 లక్షలు విడుదల చేయడంతో పనులు చేపట్టారు. ఎమ్మెల్యే గోవిందరావు ఆదేశించడంతో రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు ఆమోదించి ఉన్నతాధికారులకు అందజేశామని ఇంజనీరింగు సహాయకుడు వెంకటసాయి చెప్పారు.

చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

కొత్తూరు, న్యూస్‌టుడే: పారాపురంలో రెండు రోజుల క్రితం ఓ శుభకార్యంలో జరిగిన చోరీలకు సంబంధించి ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అహ్మద్ అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు చెందిన మణికుమార్‌ను సోమవారం అదుపులోకి తీసుకుని ఐదు చరవాణులు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఇసుక లారీలు పట్టివేత

కొత్తూరు, న్యూస్‌టుడే: మెట్టూరు కూడలిలో ఒడిశా నుంచి ఇసుకతో వస్తున్న లారీలను స్థానికులు ఆదివారం రాత్రి అడ్డుకుని పోలీసు, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. దీనిపై తహసీల్దారు, పాపారావు, డీటీ సత్యనారాయణ మాట్లాడుతూ.. విషయాన్ని జిల్లా మైన్స్ అధికారులకు నివేదించామని వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్రీకాకుళం

●శ్రీకాకుళం ●ఆమదాలవలస ●ఎచ్చెర్ల

రణస్థలంలో స్వచ్ఛతాహీ సేవ

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో రణస్థలం మండల కేంద్రం నుంచి రామతీర్థం కూడలి వరకు ఎన్‌ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు, 14వ ఆంధ్ర ఎన్‌సీసీ బెటాలియన్ కేడెట్‌లు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లు ఊడ్చి చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నేతలు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

● కీర్తన: సరిపోదా శనివారం ● కీర్తిక: దేవర ● కిన్నెర సినీమాక్స్: సత్యం సుందరం ● ఎస్‌వీసీ (రామలక్ష్మణ): దేవర ● సూర్యమహల్: దేవర ● సరస్వతి: దేవర ● చంద్రమహల్: మత్తు వదలరా-2 ● మారుతి: దేవర

– న్యూస్‌టుడే, అరసవల్లి

ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించండి

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు అన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులతో సోమవారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు. సాధారణ ఓటర్ల జాబితా రూపకల్పనపై షెడ్యూల్ ప్రకారం అధికారులు పనిచేస్తున్నారని బీఎల్‌వోతో, బీఎల్‌ఏలు సమన్వయం చేసుకొని పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా పార్టీల ప్రతినిధులు, గ్రామస్థాయిలో నూతన ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ స్టేషన్ల మార్పు అంశాలపై పలు సందేహాలను డీఆర్‌వో దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తహసీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్లు, సీ సెక్షన్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంకేత భాషపై అవగాహన తప్పనిసరి


సంకేత భాష ఆంగ్ల అక్షరమాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న బధిరుల సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: సంకేత భాషపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని శ్రీకాకుళం జిల్లా బధిరుల సంఘం ప్రతినిధులు కోరారు. ప్రపంచ సంకేత భాష దినోత్సవం సందర్భంగా జిల్లాలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్, జిల్లా పరిషత్ కార్యాలయం, పాతబస్టాండ్, డే అండ్ నైట్ కూడలి, కాంప్లెక్స్ తదితర ప్రదేశాల్లో గోడపత్రికలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బధిరుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉంగటి సురేష్, ఎస్. రవికిరణ్, ప్రతినిధులు ప్రసాద్, సాయికృష్ణ, పాల్గుణరావు, రామరాజు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఆర్ అకాడమీ క్రీడాకారుల హవా


నంబాళ్ల సుశాంత్ | రాజాన జొన్నారావు | ఆనంద్

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టు ఎంపికల్లో ఎస్ఎస్ఆర్ అకాడమీ క్రీడాకారులు మరోమారు సత్తా చాటారు. ఇటీవల నిర్వహించిన జోనల్ స్థాయి క్రికెట్ పోటీల్లో వీరు ప్రతిభ మకనబరిచి అండర్ 19 వినూమడ్కర్ ట్రోఫీ 2024-25లో ఎంపికైనట్లు శిక్షకులు ఎస్. హెచ్. శ్రీనివాసరావు, టి. శ్రీచరణ్ స్పష్టం చేశారు. ఏసీఏ ఇటీవల ప్రచురించిన జాబితాలో అకాడమీ క్రీడాకారులు నంబాళ్ల సుశాంత్, రాజాన జొన్నారావులు శ్రీకాకుళం జట్టు, కె. ఆనంద్ ప్రకాశం తరపున ఆంధ్ర జట్టుకు ఎంపికయ్యారు.

అధ్వాన దారులు... 'పుర' వాసులకు అవస్థలు!

అయిదేళ్ల పాలనలో పట్టించుకోని వైకాపా ప్రభుత్వం

న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

ఆమదాలవలస పురపాలక సంఘంలోని వార్డుల్లోని రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గత అయిదేళ్లలో వైకాపా పాలనలో వీటిని పూర్తిగా పట్టించుకోలేదు. 14వ ఆర్థిక సంఘం నిధులను గత పాలకులు సకాలంలో వినియోగించకపోవడంతో అవి వెనుక్కి వెళ్లిపోవడంతో రోడ్ల పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మున్సిపాలిటీకి దూరంగా ఉన్న వార్డుల్లో ఇవి మరీ అధ్వానంగా ఉన్నాయి. కొన్ని చోట్ల సీసీ దారులు ఉన్నా కాలువలు లేకపోవడంతో వాటిపైనే వర్షం, మురుగునీరు నిల్వ ఉండిపోతోంది. తిమ్మాపురం, కృష్ణాపురం, చింతాడ, నందగిరిపేట, సప్తపురాలు, కుద్దిరాం, కశింవలసపేట, గేదెలవానిపేట, మెట్టక్కివలస, బీఆర్‌నగర్‌లో కొంత ప్రాంతం, పార్వతీశంపేట తదితర ప్రాంతాల్లో ఇప్పటికీ సీసీ దారులు లేక ఆ ప్రాంతాల వాసులు ఆవేదన చెందుతున్నారు.

ఆమదాలవలస మున్సిపాలిటీలో వార్డులు: 23
పట్టణ విస్తీర్ణం : 21.63 చదరపు కిలోమీటర్లు
రహదారుల విస్తీర్ణం: 78.7 కిలోమీటర్లు
జనాభా: 39,806 మంది

శివారు వార్డులకు ఏదీ దారి: పట్టణ శివారు వార్డులైన తిమ్మాపురం, ఊసవానిపేట, గేదెలవానిపేట, కె మన్నయ్యపేట, సప్తపురాలు, చింతాడల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. పట్టణ పరిధికి చెందినప్పటికీ సీసీ రహదారులకు నోచుకోలేదు. ముఖ్యంగా ఆమదాలవలస మున్సిపాలిటీ, శ్రీకాకుళం నియోజకవర్గం పరిధిలో ఇవి ఉండటంతో ఇరు ప్రాంతాల పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శ ఉంది. పురపాలక సంఘానికి అధిక ఆదాయాన్నిచ్చే బీఆర్‌నగర్‌కు కూడా కచ్చా దారులే ఉన్నాయి.


బీఆర్ నగర్‌లోని ఓ వీధికి వెళ్లే మట్టి రహదారి ఇలా..

ఇంటి ముందే మురుగు: వీధుల్లో సీసీ రహదారులు, కాలువలు లేకపోవడంతో ఇంటి ముందే మురుగు నీరు నిల్వ ఉండటంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు పడితే రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. ఈ సమస్యను ప్రజాప్రతినిధులకు తెలియపరిచినా ఫలితం లేకుండా పోయింది.

–రాజారావు, బీఆర్‌నగర్, ఆమదాలవలస

కాలువలతో కూడిన సీసీ రోడ్లు నిర్మిస్తాం: పురపాలకం పరిధిలోని కొన్ని వార్డుల్లో సీసీ రహదారులు లేవు. వాటిని గుర్తించాం. రోడ్ల నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రణాళికలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదించాం, నిధులు మంజూరు కాగానే కాలువలతో కూడిన సీసీ దారులను నిర్మిస్తాం. –బి.బాలాజీప్రసాద్, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస

సర్పంచుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా వెంకట భానోజీనాయుడు

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: రణస్థలం సర్పంచి పిన్నింటి వెంకట భానోజీనాయుడు జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల వరకు ఈ బాధ్యతలు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ నిర్వహించారు. సోమవారం శ్రీకాకుళంలోని ఏపీ ఛాంబరు కార్యాలయంలో భానోజీనాయుడును సర్పంచులంతా కలిసి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబరు అధ్యక్ష, ఉపాధ్యక్షులు వై. వి. రాజేంద్రప్రసాద్, అన్నెపు రామకృష్ణ, రాష్ట్ర సర్పంచుల సంఘ అధ్యక్షుడు వానపల్లి లక్ష్మీముత్యాలనాయుడు తదితరులు అభినందించారు.


భానోజీనాయుడిని అభినందిస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, పంచాయతీరాజ్ ఛాంబర్ నాయకులు

వీహెచ్‌పీ కార్యకర్తల నిరసన

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ చేయించి దోషులను కఠినంగా శిక్షించాలని. . ఆలయాల్లో పని చేస్తున్న అన్యమతస్థులను తొలగించాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) డిమాండ్ చేసింది. శ్రీకాకుళం నగరంలోని జడ్పీ కార్యాలయం వద్ద సోమవారం కార్యకర్తలు నిరసన తెలిపి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతి పత్రం అందజేశారు. వీహెచ్‌పీ రాష్ట్ర మందిర అర్చక పురోహిత్ సింహాద్రి ఫల్గుణరావు, ఉపాధ్యక్షుడు గొద్దు భాస్కర్, కోశాధికారి ధర్మవరం ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం



సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం



మండలంలోని జరజాం పంచాయతీ గొలివివానిపేట గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధితుడు గొలివి గణేష్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 15 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావులు కలసి సోమవారం బాధితుడు ఇంటి వద్ద ఆర్థిక సహాయ పత్రం అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు మల్లేసు, మాజీ సర్పంచులు దాలినాయుడు, తంగి మల్లేశ్వరరావు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

పొంచి ఉన్న ప్రమాదం..!

సరుబుజ్జిలి మండలంలోని అలికాం-బత్తిలి రహదారిలో బప్పడాం వద్ద కల్వర్టుకు తూర్పు భాగంలో రక్షణ గోడ లేకపోవడంతో వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. ఇక్కడ కల్వర్టు ఇరుకుగా ఉండటం , రక్షణ గోడ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని బిక్కు బిక్కుమంటూ ప్రయాణాలు చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ జేఈ ఆంజనేయనాయక్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, సరుబుజ్జిలి



పొలం కాదు.. కళాశాల మైదానం



ఆమదాలవలస మండలం తొగరాం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏపుగా పచ్చగడ్డి, పనికిరాని మొక్కలు పేరుకుపోవడంతో విద్యార్థులు క్రీడలు ఆడేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మైదానం పచ్చదనంతో ఉండటంతో ఆ ప్రాంతంలోని రైతులు తమ పశువులను తెచ్చి వదిలేయడంతో పచ్చగడ్డి మేస్తున్నాయి. అధికారులు స్పందించి వాటిని తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయమై ప్రిన్సిపల్ విజయగజపతి రాజు స్పందిస్తూ ఇటీవల వర్షాలు కారణంగా మళ్లీ మొక్కలు పెరిగిపోయాయని తక్షణమే వాటిని తొలగించే విధంగా చర్యలు చేపడతామన్నారు.

–న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

ప్రమాదం జరిగాక పట్టించుకుంటారా?

గార మండలం శ్రీకూర్మంలో చాకలివీధి వద్ద రహదారిపై భవన నిర్మాణ సామగ్రి వేశారు. ఈ మార్గం నిత్యం వాహనాల రాకపోకలుతో రద్దీగా ఉంటుంది. సామగ్రి ఉన్న ప్రాంతంలోని కల్వర్టుకు రక్షణ గోడ సైతం లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ గోవిందరావు మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, గార



క్షయవ్యాధిపై పరిశోధనకు మాధవరావుకు డాక్టరేట్

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా. బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బయోటెక్నాలజీలో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న పి. మాధవరావు క్షయవ్యాధిపై చేసిన పరిశోధనకు గాను వర్సిటీ ఆయనకు డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసింది. ఈ మేరకు వర్సిటీ ఉప కులపతి ఆచార్య కె. ఆర్. రజని, రిజిస్ట్రార్ పీలా సుజాత సోమవారం డాక్టరేట్ పట్టాను మాధవరావుకు అందజేశారు. క్షయ వ్యాధి రోగుల్లో మరణాలు, మనుగడ రేటును ప్రభావితం చేసే కీలక అంచనాల అధ్యయనం విశ్లేషణపై బయోటెక్నాలజీ ఆచార్యులు డా. పీలా సుజాత మార్గదర్శకంలో చేసిన పరిశోధనకు ఆయనకు డాక్టరేట్ లభించింది.

కలెక్టరుకు గ్రామస్థుల ఫిర్యాదు

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరులో 122 సర్వే నంబరులో రస్తా పట్టా విషయంలో గ్రామస్థులు సోమవారం జిల్లా గ్రీవెన్స్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రస్తాలో ఇచ్చిన పట్టాను కోర్టు ఆదేశాల మేరకు రద్దు చేసినా వెబ్ ల్యాండ్‌లో పేరు కొనసాగుతుండటంతో పట్టాదారులు ఇటీవల రెవెన్యూ సర్వే అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇటీవల రైతులు పూర్తి ఆధారాలతో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.

సభ్యత్వ నమోదులో మొదటిస్థానంలో నిలవాలి

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: తెలుగుదేశం సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేయించి జిల్లాలో శ్రీకాకుళం నియోజకవర్గం మొదటి స్థానంలో ఉంచాలని ఎమ్మెల్యే గొండు శంకర్ తెదేపా శ్రేణులకు పిలుపునిచ్చారు. నగరంలోని జిల్లా తెదేపా కార్యాలయంలో సోమవారం నగర తెదేపా అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ సభ్యుడిగా నియమితులైన శీర రమణయ్యని ఎమ్మెల్యే శాలువతో సత్కరించారు.

ఘనంగా గ్రంథాలయ వార్షికోత్సవం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఫరీదుపేట గ్రామంలో కొత్తకోట రామలక్ష్మి స్మారక గ్రంథాలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత రామలక్ష్మి చిత్రపటానికి వమ్మరవల్లి డైట్ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు కొత్తకోట అప్పారావు, స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివంగత రామలక్ష్మి రాసిన కవిత్వాలతో రచించిన 'నేను ఒక కవిత్వం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: ఒప్పంద, ఆప్కాస్ కార్మికులకు కనీస వేతనం కింద రూ. 26వేల ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి. తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఒప్పంద, పొరుగు సేవలు, పార్ట్‌టైమ్ పేర్లతో ఉన్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. సీఐటీయూ అఖిల భారత్ పిలుపుమేరకు సోమవారం శ్రీకాకుళం కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతి పత్రం అందజేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం


గర్భిణుల సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస పట్టణం, శ్రీకాకుళం నగరం న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను తింటేనే మహిళలు ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం ఆమదాలవలసలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం గర్భిణుల సీమంత కార్యక్రమంలో పాల్గొని వారికి పోషకాహారాన్ని అందించారు. అనంతరం పట్టణంలోని డ్వాక్రా బజారును ఆయన పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ పి. బాలాజీప్రసాద్, ఐసీడీఎస్ పీఓలు ఎస్. అనురాధ, పి. గీత, తదితరులు పాల్గొన్నారు. ★ పోషకాహారంతోనే ఆరోగ్యం బాగుంటుందని శాసనసభ్యుడు గొండు శంకర్ అన్నారు. జాతీయ పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో నగరంలో రైతుబజారు దరి పట్టణ మహిళా సమాఖ్య వనరుల కేంద్రంలో నిర్వహించిన ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. నగర తెదేపా అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, మెప్మా పీడీ ఎస్. వి. రమణ, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ కలిగిన నాయకుడు ఎమ్మెల్యే గొండు

శ్రీకాకుళం నగరం న్యూస్‌టుడే: ఎమ్మెల్యే గొండు శంకర్ క్రమశిక్షణ కలిగిన నాయకుడని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీవీ రాజేంద్రప్రసాద్ అన్నారు. నగరంలో 80 అడుగుల రహదారిలో ఆనందమయి సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో జరిగిన ఎమ్మెల్యే సత్కార కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఉమ్మడి జిల్లాల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఉంటూ శాసనసభ్యుడిగా విజయం సాధించడంపై ప్రశంసించారు. పంచాయతీరాజ్ ఛాంబర్ తరపున రాజేంద్ర ప్రసాద్, ఎమ్మెల్యే గొండు శంకర్‌ను సత్కరించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వానపల్లి లక్ష్మి ముత్యాలరావు,బీర్రు ప్రతాపరెడ్డి, పగడాల రమేష్, ప్రతినిధులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సత్కరించిన రాజేంద్రప్రసాద్, చిత్రంలో ఆనెపు రామకృష్ణ, ఇతర పంచాయతీ రాజ్ ఛాంబర్ సభ్యులు

ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఎచ్చెర్ల(రణస్థలం), ఆమదాలవలస పట్టణం,న్యూస్‌టుడే: మండలంలోని కందివలసగెడ్డ వద్ద సోమవారం రాత్రి జె. ఆర్. పురం పోలీసులు రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను కందివలస గెడ్డ వద్ద పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు జె. ఆర్. పురం ఎస్సై ఎస్. చిరంజీవి తెలిపారు.★ నాగావళి నదీతీర ప్రాంతాలైన దూసి, ముద్దాడపేట, తొగరాం, కొత్తవలస తదితర ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను సోమవారం ఉదయం ఎస్సై వెంకటేష్ సిబ్బందితో దాడులు చేసి దూసి వద్ద పట్టుకున్నారు. వీటిపై కేసు నమోదు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

ఉపాధి మేళాలో కొలువుల పంట

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జాబ్‌మేళాలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల విద్యార్థులు మంది కొలువులు సాధించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల నోడల్ రీసోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో కమిషనరేట్ ఆఫ్ కాలేజీయోట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 118 మంది పాల్గొనగా 28 హెట్రో ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఎంపికయ్యారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

పొందూరు, న్యూస్‌టుడే: శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభను కనబరిచిన మండలంలోని లోలుగు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ(కేజీబీవీ)కు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఆర్. సౌమ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం. రూపవతిలు తెలిపారు. బేస్‌బాల్ అండర్-19 విభాగంలో విద్యార్థినులు టి. సంతు, ఎస్. కల్పనలు ఎంపికయ్యారన్నారు. అక్టోబరు 2న ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపల్ ఆర్. సౌమ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

సేవలతోనే సంతృప్తి

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: సేవలతోనే సంతృప్తి కలుగుతుందని చిక్కోలు సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు డా. గుడ్ల అప్పలనర్సిహులు(బాబు) అన్నారు. ఆమదాలవలసలోని అశోక పాఠశాల యాజమాన్యం వి. టి. చౌదిరి, జిల్లా పర్యాటక అధికారి ఎన్. నారాయణరావు సోమవారం బాబు దంపతుల సేవలకు గుర్తింపుగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవరుచుకోవాలని తెలిపారు. అనంతరం వి. టి. చౌదరి మాట్లాడుతూ బాబు సేవా కార్యక్రమాలకు ఇటీవల గోవాలో భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ డాక్టరేట్ ప్రదానం చేసి ఆయనను గుర్తించిందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంచి అలవాట్లతో ఆరోగ్యం పదిలం

శ్రీకాకుళం సాంస్కృతికం, పొందూరు, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నగరంలో అక్షర పాఠశాలలో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో చిన్నారుల్లో క్యాన్సర్‌పై అవగాహనకు విద్యార్థులకు పీస్ పోస్టర్ పోటీలు జరిగాయి. లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు డా. బొడ్డేపల్లి సురేష్ పాల్గొని మాట్లాడారు. మంచి అలవాట్లతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సురేష్, లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యదర్శి డా. పైడి సింధూర ప్రశంసాపత్రాలు అందజేశారు. ★ పొందూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సిస్టమ్ డిగ్రీ కళాశాలలో పారామెడికల్ విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ వై. మల్లిబాబు క్యాన్సర్ గురించి వివరించారు.


ఏర్పాట్ల పరిశీలన

శ్రీకాకుళం నగరం న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఆర్ అండ్‌బీ అతిథి గృహం, డచ్‌భవన్ వద్ద కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

శ్రీకాకుళం నగరం: ఇటీవల స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో ఎవీఎన్ఎంహెచ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. ఇందిరామణి తెలిపారు. జూడో, తైక్వాండో, బాక్సింగ్, చదరంగం, హకీ విభాగాల్లో పోటీలో పాల్గొననున్నట్లు చెప్పారు.

డీఎస్‌వోగా సూర్యప్రకాశరావు



శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా పౌర సరఫరాల అధికారిగా జి. సూర్యప్రకాశరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.

అవీ..ఇవీ..అన్నీ

ఎన్నో విజయాలు, మరెన్నో అనుభూతులు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరక్టర్‌గా సుదీర్ఘ కాలం విధులు నిర్వహించి ఎన్నో విజయాలు, మరెన్నో అనుభూతులతో ఉద్యోగ విరమణ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని జేడీ కె. శ్రీధర్ అన్నారు. తనకు వెన్నుదన్నుగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో సోమవారం జేడీ శ్రీధర్ వీడ్కోలు సభను నిర్వహించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, విశ్రాంత జేడీ రామరాజు, వ్యవసాయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో ప్లానింగ్ ప్రక్రియ ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని డ్వామా పీడీ బి. సుధాకర్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో అన్ని మండలాల ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధి హామీలో చేపట్టే అన్నిరకాల పనులను క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా గుర్తించి అంచనాలు వేయాలన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని మండల విద్యాశాఖాధికారి గెడ్డాపు రాజేంద్రప్రసాద్ అన్నారు. దూసి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన కె. వి. ఎస్. రత్నకుమారి ఉద్యోగ విరమణ పొందడంతో ఆమెను సన్మానించారు.

భగవద్గీతను చదవడం నేర్చుకోవాలి

ఆమదాలవలస గ్రామీణం: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతపై దృష్టి సారించాలని, భగవద్గీతను చదవడం నేర్చుకోవాలని భగవద్గీత ప్రచార సమితి అధ్యక్షుడు అంపోలు రామాచార్యులు అన్నారు. సోమవారం మండలంలోని రామచంద్రాపురం, పొన్నాంపేట గ్రామాల్లో ఈ మేరకు ప్రచారం చేపట్టారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

గుజరాతీపేట, న్యూస్‌టుడే: ఇండియన్ ఆర్మీ కాలింగ్ అకాడమీలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ విభాగాల వైద్య నిపుణులు 150 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, పలు ఆరోగ్య నియమాలను సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగించారు. వైద్యులు హర్షవల్లి, శిరీష, లక్ష్మి, పార్వతి, అనిత తదితరులు పాల్గొన్నారు.



సందడిగా స్వాగతోత్సవం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాలలో సోమవారం స్వాగతోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కె. సూర్యచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.